స్కాన్ చేయండి...
పేపర్ చదవండి...

అక్షర
# రాజముద్ర

www.rajamudranews.com

ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
RNI No: TELTEL/2024/86684

బుధవారం | 14.05.2025 | సంపుటి : 2 | సంచిక :102 | పేజీలు : 8 | వెల : 2/-

**విలేకరులు కావలెను**

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.

సంప్రదించాల్సిన చిరునామా..

సెల్ : 91824 74575



03

పదవీ విరమణ చేసిన
## జస్టిస్ట్ సంజీవ్ ఖన్నా

- ఘనంగా వీడ్కోలు పలికిన బార్ అసోసియేషన్
- తదుపరి ఎలాంటి పదవులు చేపట్టబోనన్న ఖన్నా
- నేడు సుప్రీం చీఫ్ జస్టిస్‌గా గవాయ్ ప్రమాణం
- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



10

జమ్మూకశ్మీర్‌లో
## ఎన్‌కౌంటర్
ముగ్గురు ఉగ్రవాదులు హతం

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

## అది మన సంప్రదాయం.. విధానం కూడా

- వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా
- ప్రపంచమంతా మార్మోగిన ఆపరేషన్ సిందూర్ నినాదం
- యుద్ధక్షేత్రంలో జై భారత్ మాతా నినాదాలు
- ఆదంపూర్ ఎయిర్‌బేస్‌ను సందర్శించిన మోడీ
- సైనికులకు సెల్యూట్ చేసి ముచ్చటించిన ప్రధాని



**చండీఘడ్, మే 13 :**
ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టడం.. మన సంప్రదాయం.. మన విధానమని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. మన సైన్యం చూపిన శక్తి సామర్థ్యాలు భావితరాలకు గొప్ప ప్రేరణ అని ఆయన అభివర్ణించారు. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ తాను సెల్యూట్ చేస్తున్నారన్నారు. వీర సైనికుల పరాక్రమంతో ఆపరేషన్ సిందూర్ నినాదం.. ప్రపంచమంతా మార్మోగుతోందని తెలిపారు. మంగళవారం పంజాబ్‌లోని అదంపూర్ ఎయిర్‌బేస్‌ను ప్రధాని మోదీ సందర్శించారు. ఈ సందర్భంగా సైనికులతో ఆయన మాట్లాడారు. అనంతరం సైనికులను ఉద్దేశించి ప్రసంగించారు.

మిగతా 4 లో



# సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

- సోషల్ మీడియాలో సిబిల్ స్కోర్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు
- రాజీవ్ యువ వికాసం స్కీమ్‌పై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**భద్రాద్రి కొతగూడెం, మే 13 :** రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం స్కీమ్‌ను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అయితే.. సిబిల్ స్కోర్ ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ప్రచారం జరగడంతో యువతలో ఆందోళన నెలకొంది. గ్రామ యువతకు సిబిల్ స్కోర్‌పై పెద్దగా అవగాహన ఉండదని.. స్కీమ్ గైడ్ లైన్స్‌లో ఈ అంశాన్ని చేర్చొద్దని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో రాజీవ్ యువ వికాసం స్కీముపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క క్లారిటీ ఇచ్చారు. సిబిల్ స్కోర్‌తో రాజీవ్ వికాసం స్కీమ్‌కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. అవగాహన లేని కొన్ని సోషల్ మీడియా, ఇతర సంస్థలు సిబిల్ స్కోర్ విషయంలో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని అన్నారు.

మిగతా 3 లో



03

ప్రభుత్వంపై వరుస పోరాటాలకు
## సిద్ధం కండి
వరంగల్ నేతలకు కేటీఆర్ పిలుపు

03



సంక్షేమ హాస్టళ్లలో
## మెరుగైన వసతులు


- విద్యా సంవత్సరానికి ముందే ఏర్పాట్లు
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు

03



అండమాన్‌ను తాకిన
## నైరుతి రుతుపవనాలు

10



## పాక్‌తో సరిహద్దు నగరాలకు పలు విమానాలు రద్దు

10

## పాలన అంటే ప్రతిపక్షాలపై
# దుమ్మెత్తిపోయడం కాదు

- కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగుల కొరత
- ధాన్యం కేంద్రాల్లో కనీస సౌకర్యాలు మృగ్యం
- రైతుల ఆత్మహత్యలకు మీరే కారణం
- బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శలు



**హైదరాబాద్, మే 13 :**
ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించాలని.. రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహిం చారు. రైతులను గాలికి వదిలేసి.. అందాల పోటీ-లు నిర్వహి స్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గన్నీ బ్యాగులను సమకూర్చడంలో ప్రభుత్వం వైఫలయ్యం చెందిందన్నారు. ధాన్యాన్ని లారీలకు ఎక్కించే హమాలీలను సమకూర్చడం లో విఫలమైందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో, గొప్పగా చెప్పిన బోనస్ అందజే యడంలో ఘోర వైఫల్యమంటూ ధ్వజమెత్తన్నారు. గత అసెంబ్లీలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ మా ప్రభుత్వంలో తరుగు తీమయని చెప్పారని.. ములుగు జిల్లా గోవిందరావుపేట మండ లంలో జెట్టి రాజు అనే రైతు క్వింటాల్‌కు పది కిలోలు తరుగు తీస్తున్నారని ఆత్మహత్య చేసుకున్నాన్నారు. రాష్ట్రవ్యాప్తం గా సో మ, మంగళవారాల్లో రైతులు ఆందోళన చేపట్టారన్నారు. తాలు, తరుగు పేరుతో రైతులకు అన్యాయం జరుగుతోందన్నారు.

మిగతా 3 లో

## కుడితిలో పడ్డ ఎలుకలా
# పాక్ పరిస్థితి

- సైన్యానికి, ఉగ్రవాదులకు తలొగ్గే దుస్థితి
- బలూచీ ఉద్యమం మరింత ఉధృతంతో భయం

పాక్ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. భారత్ ప్రతిదాడితో ఇక మున్ముందు సాహసం చేసే పరిస్థితి లేకుండా చేసుకుంది. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, ఉసిగొల్పడం ద్వారా భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకపోతే పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరని గతంలో అనేకమార్లు రుజువయ్యింది.

04



పది వేల చెంచు కుటుంబాలకు
# ఇందిరమ్మ ఇళ్లు

- జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిసారించాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, మే 13 :**
రాష్ట్రంలోని నాలుగు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ)ల పరిధిలో పది వేల చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంగళవారం గృహనిర్మాణ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. "గిరిజన ప్రాంతాల్లో శాశ్వత గృహాలను నిర్మించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పలు సందర్భాల్లో సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా గిరిజనులకు ఇళ్ల మంజూరుపై పలు సూచనలు చేశారు.

మిగతా 2 లో

## డిసెంబరు 9న స్కిల్స్ వర్సిటీ
# క్యాంపస్ ప్రారంభం

- మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ తాత్కాలిక కార్యాలయం
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి

02



ధాన్యం కొనుగోళ్లపై హరీశ్‌రావు
## అబద్ధాలు మానుకోవాలి
మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

02



వ్యవసాయ శాఖపై
## త్వరలో సీఎం సమీక్ష

రైతు భరోసా, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం

02





11

భారీ నష్టాల్లో
## ముగిసిన సూచీలు

prime

ప్రైమ్ వీడియోలో
## ఇక యాడ్స్..
వద్దనుకుంటే అదనంగా చెల్లించాల్సిందే

11

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక



## కుటుంబ సమేతంగా సిఎంను కలిసిన సమాచార కమిషనర్లు

**హైదరాబాద్, మే 13:** జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సమాచార కమిషనర్లుగా నియమితులైన నలుగురు మర్యాదపూర్వకంగా కలిశారు. వీరంతా కుటుంబ సమేతంగా కలిసి సిఎంకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన సమాచార కమిషనర్లు పీవీ శ్రీనివాసరావు, బోరెడ్డి అయోధ్యరెడ్డి, దేశాల భూపాల్, మొహిసినా పర్వీన్‌లు తమ కుటుంబాలతో సిఎంను కలవడం విశేషం. వారికి సిఎం అభినందనలు తెలిపారు.

## పది వేల చెంచు కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)

వారి సూచనలు, సలహాల మేరకు.. ఆదిమ గిరిజన తెగలలోని అతి బలహీనవర్గాలైన చెంచులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నాం. ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని ఆసిఫాబాద్‌లో 3,551, బోథ్‌లో 695, ఖానాపూర్‌లో 1,802, సిర్పూర్‌లో 311, ఆదిలాబాద్‌లో 1,430, బెల్లంపల్లిలో 326 ఇళ్లను ఇస్తున్నాం. భద్రాచలం ఐటీడీఏ పరిధి అశ్వారావుపేటలో 105 మందికి ఇళ్లను అందిస్తున్నాం. అచ్చంపేటలో 518, మహబూబ్‌నగర్‌లో 153, పరిగిలో 138, తాండూర్‌లో 184 ఇళ్లను మంజూరు చేస్తున్నాం. అడవులను నమ్ముకొని జీవించే చెంచులు ఆ ప్రాంతాలను వదలి వెళ్లలేరు. దశాబ్దాలుగా ఏ ప్రభుత్వం కూడా వీరికి ఇళ్లు ఇవ్వాలని ఆలోచించలేదు. మా ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసింది" అని మంత్రి పేర్కొన్నారు. 'ఈ ఏడాది ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గిరిజన నియోజకవర్గాలకు అదనంగా మరో 500 నుంచి 700 ఇళ్లను ఇస్తున్నాం. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లకుగాను 20 శాతం ఇళ్లను బఫర్ జోన్ కింద తీసుకొచ్చాం. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించాం. మురికివాడల్లో నివసిస్తున్న ప్రజలు.. దూరంగా ఇళ్లు నిర్మించి ఇస్తామంటే ఆసక్తి చూపడం లేదు. గత ప్రభుత్వం కొల్లూరులో రెండు పడకల గదుల ఇళ్లు నిర్మించి హైదరాబాద్‌లోని పేదలకు ఇవ్వాలని నిర్ణయిస్తే ఎవరూ ముందుకు రాలేదు. వీటిని దృష్టిలో పెట్టుకుని పేదలు గుడిసెలు వేసుకుని నివసిస్తున్న ప్రాంతాల్లోనే జీ3 పద్ధతిలో ఇళ్లు నిర్మించి ఇవ్వాలని భావిస్తున్నాం' అని పొంగులేటి వెల్లడించారు.

### ధాన్యం కొనుగోళ్లపై హరీశ్‌రావు

## అబద్ధాలు మానుకోవాలి

### మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



**హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం గతంలో కన్నా ఎక్కువ మొత్తంలో ధాన్యం కొనుగోళ్లు చేస్తూ రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తుంటే.. మాజీ మంత్రి హరీశ్‌రావు మాత్రం అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంగళవారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. అబద్ధాలను ప్రచారం చేస్తూ అవే నిజాలుగా ప్రజలను భ్రమింపజేసే ప్రయత్నాలను హరీశ్ మానుకోవాలని ఆయన సూచించారు. "యాసంగి సీజన్‌లో ఇప్పటికే 65 శాతం మేర ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి. గడిచిన రెండేళ్ల యాసంగితో పోలిస్తే 120 శాతం అధికంగా కొంటున్నాం. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం వ్యవధిలోనే వానాకాలం, యాసంగి సీజన్‌లకు కలిపి మొత్తం 280 లక్షల టన్నులు దిగుబడి వచ్చింది. ధాన్యం దిగుబడిలో ఇదో రికార్డు. ఈ యాసంగి సీజన్‌లో ఇప్పటి వరకు 65 శాతం మేర ధాన్యం కొనుగోలు పూర్తి చేశాం. గత యాసంగి సీజన్‌తో పోల్చితే ఈసారి కొనుగోలు చేసింది 23.48 లక్షల టన్నులు అధికం. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం 8,245 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించింది. ఇవి గతేడాది కంటే 1,067 అధికం. ఈ యాసంగి సీజన్‌లో 60.14 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేయగా 1.29 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేస్తున్నాం. అందులో 70.13 లక్షల టన్నులు కొనుగోలు కేంద్రాలకు వస్తున్నట్లు భావిస్తున్నాం. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.58 లక్షల మంది రైతుల నుంచి 43.10 లక్షల టన్నులు కొనుగోలు చేశాం. వీటి విలువ రూ.9,999.36 కోట్లు కాగా ఇప్పటి వరకు ప్రభుత్వం రైతులకు రూ.6,671 కోట్లు చెల్లించింది" అని ఉత్తమ్ తెలిపారు.

### వ్యవసాయ శాఖపై

## త్వరలో సీఎం సమీక్ష

### రైతు భరోసా, ఇతర అంశాలపై నిర్ణయం తీసుకునే అవకాశం



**హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించనున్నారు. వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతు భరోసా తదితర పథకాల అమలుతో పాటు ఇతర అంశాలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. వానాకాలం సీజన్‌లో రైతు భరోసా అమలుకు సంబంధించి ప్రతిపాదనలను అధికారులు రూపొందిస్తున్నారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపైనా నివేదిక రూపొందించారు. రైతు బీమా ప్రీమియం చెల్లింపు, పంటల బీమా పథకం విధివిధానాలు తదితరాలపై సీఎం సమీక్షలో చర్చకు రానున్నాయి. కోహెడలో అంతర్జాతీయ ప్రమాణాలతో మార్కెట్ యార్డుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దానిపైనా సీఎం తుది నిర్ణయం తీసుకోనున్నారు. మరో వెయ్యి రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం కల్పనకు ఆమోదం తెలపాల్సి ఉంది. వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి 6.50 లక్షల దరఖాస్తులు వచ్చాయి. పథకం అమలుకు రూ.300 కోట్లు అవసరం. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)ల విలీనం, వ్యవసాయ శాఖ పరిధిలోని కార్పొరేషన్లను విలీనం చేయడంపైనా తుది నిర్ణయం తీసుకునే వీలుందని వ్యవసాయశాఖ వర్గాలు భావిస్తున్నాయి.

# డిసెంబరు 9న స్కిల్స్ వర్సిటీ క్యాంపస్ ప్రారంభం

- మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ తాత్కాలిక కార్యాలయం
- ఐటీ, పరిశ్రమల మంత్రి శ్రీధర్‌బాబు వెల్లడి



**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ శాశ్వత క్యాంపస్‌ను డిసెంబరు 9న ప్రారంభిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రకటించారు. తమ ప్రభుత్వం ఒకవైపు పారిశ్రామిక అభివృద్ధిని, మరోవైపు యువతకు ఉపాధి కల్పన కార్యక్రమాలను చేపట్టిందన్నారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలోని వర్సిటీ శాశ్వత క్యాంపస్‌లో కొనసాగుతున్న భవనాల నిర్మాణ పురోగతిని ఆయన మంగళవారం పరిశీలించారు. గుత్తేదారు సంస్థ ప్రతినిధులు, సంబంధిత అధికారులతో సమీక్షించి, పనులను సకాలంలో పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... "అకడమిక్ బ్లాక్, ప్రయోగశాలలు, వసతి గృహాలు, కార్యాలయాల భవనాల నిర్మాణాలను పూర్తిచేసి ఈ ఏడాది డిసెంబరు 9న క్యాంపస్‌ను లాంఛనంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రస్తుతం గచ్చిబౌలిలో తాత్కాలికంగా కొనసాగుతున్న స్కిల్స్ వర్సిటీలో ఫార్మా, రిటైల్, లాజిస్టిక్స్, ఏవియేషన్ అండ్ ఎయిర్‌పోర్టు మేనేజ్‌మెంట్ వంటి కోర్సులను అందిస్తున్నాం. ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతాం. ఒకేసారి 100 అడుగులు వేయలేమని తెలిసినా.. కొందరు ప్రతిపక్ష నేతలు మాపై దుష్ప్రచారం చేస్తున్నారు. భావితరాల అవసరాల కోసం సుస్థిరాభివృద్ధే లక్ష్యంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తాం. త్వరలో ఫ్యూచర్ సిటీ అథారిటీ తాత్కాలిక కార్యాలయాన్ని మీర్‌ఖాన్‌పేటలో ప్రారంభిస్తాం. తెలంగాణను నైపుణ్య హబ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రతి జిల్లా కేంద్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం" అని వివరించారు. సమీక్షలో వర్సిటీ ఉపకులపతి సుబ్బారావు, రిజిస్ట్రార్ సుధాకర్, ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, కృష్ణనాయక్, పాండురంగారెడ్డి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగ ఐకాస నిరసన ప్రదర్శన వాయిదా

### అధికారుల కమిటీ నియామకం నేపథ్యంలో నిర్ణయం



**హైదరాబాద్:** రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి ముగ్గురు ఐఏఎస్ అధికారులతో ప్రభుత్వం కమిటీని నియమించిన నేపథ్యంలో ఈ నెల 15న భోజన విరామ సమయంలో నిర్వహించతలపెట్టిన నిరసన ప్రదర్శనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ ఉద్యోగుల ఐకాస(టీజీఈజాక్) ప్రకటించింది. ఉద్యోగ ఐకాస సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని టీఎన్‌జీఓ కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఐకాస ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ తాము బోనస్‌లు, అదనపు భత్యాలు, జీతాల పెంపు, అదనపు కోరికలు కోరటం లేదని తెలిపారు. ప్రభుత్వ ప్రకటనతో తమను ప్రజలు దోషులుగా చూసే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం డీఏలు ప్రకటించిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు రాజ్యాంగబద్ధంగా ప్రకటించాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకో నెల రోజులు గడిస్తే ఆరోది కూడా వస్తుందని చెప్పారు. 47 ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న రూ.10 వేల కోట్ల ఉద్యోగుల బిల్లులను విడుదల చేయాలని, ఐదు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని, ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో ఐకాస నేతలు పి.దామోదర్‌రెడ్డి, చావ రవి, వి.రవీందర్‌రెడ్డి, సదానందం గౌడ్, ముజీబ్, ఎ.సత్యనారాయణ, మధుసూదన్‌రెడ్డి, మారం అంజిరెడ్డి, కటకం రమేశ్, చంద్రశేఖర్‌గౌడ్, మణిపాల్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఇప్పటివరకు చిన్నారెడ్డి కమిటీ, ఆ తర్వాత భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రివర్గ ఉపసంఘం, తాజాగా నవీన్ మిత్తల్ ఛైర్మన్‌గా కమిటీని ప్రభుత్వం నియమించింది. అయితే కమిటీల పేరుతో కాలయాపన చేయకుండా తక్షణమే ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి. సాధారణ బదిలీలు ఏటా ఏప్రిల్, మే నెలల్లోనే చేపట్టాలి. గత ఎన్నికల సందర్భంగా జరిగిన బదిలీలను రద్దు చేసి... ఉద్యోగులను సొంత జిల్లాలకు పంపించాలి. దేశంలో ప్రస్తుతం నెలకొన్న యుద్ధ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా దేశ, రాష్ట్ర ప్రభుత్వాలకు అండగా ఉండటానికి ఐకాస ఛైర్మన్, ప్రధాన కార్యదర్శిలకు ఏ నిర్ణయమైనా తీసుకునే సంపూర్ణ అధికారం అప్పగింత. ఉద్యోగ సంఘాల మాజీ నేతలు ఉద్యోగుల పక్షపాతులుగా వ్యవహరిస్తే బాగుంటుంది. కానీ, ప్రభుత్వానికి, ఉద్యోగ సంఘాల ఐకాసకు మధ్య చిచ్చుపెట్టేలా వ్యవహరించవద్దు. ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా, వ్యతిరేకంగా ఐకాస పనిచేయదు.

## భారత్-పాక్ కాల్పుల విరమణ మా ఘనతే

### అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్



**న్యూయార్క్ :** భారత్-పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు పెరగకుండా కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంలో తమ పాలనా విభాగం మధ్యవర్తిత్వ పాత్రను విజయవంతంగా పోషించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పునరుద్ఘాటించారు. ఇరుదేశాల మధ్య అణు యుద్ధం జరగకుండా నిలువరించిందని తెలిపారు. శత్రుత్వాన్ని విడిచిపెడితే వారితో అమెరికా భారీ ఎత్తున వర్తకాన్ని చేస్తుందని ప్రతిపాదించిందన్నారు. నాలుగు రోజుల పశ్చిమాసియా పర్యటనలో భాగంగా మంగళవారం సౌదీ అరేబియాకు చేరుకున్న ట్రంప్ రియాద్‌లో జరిగిన సౌదీ-అమెరికా పెట్టుబడుల ఫోరం సమావేశంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా "నా ప్రారంభోపన్యాసంలో చెప్పినట్లు శాంతిపరిరక్షకుడిగా, ఐక్యతావాదిగా ఉండాలన్నది నా ఆశయం. నేను యుద్ధాన్ని ఇష్టపడను. భారత్-పాక్‌ల మధ్య ఒప్పందం కుదిరేందుకు వాణిజ్యాన్ని ఉపకరణంగా వినియోగించాను. 'సహచరులారా రండి..ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందాం..కొంత వ్యాపారం చేద్దాం' అని వారికి నచ్చచెప్పాను. అణు క్షిపణుల వాణిజ్యం చేయొద్దు. అందరికీ ఆనందాలు కలగచేసే విషయాల్లో చేద్దాం. వారిద్దరూ(భారత్-పాక్ పాలకులు) గొప్ప, శక్తిమంతమైన, ఉత్తమ, తెలివైన నేతలు. అంతా(యుద్ధం) నిలిచిపోయింది. అది అలాగే కొనసాగాలని ఆశిద్దాం" అంటూ ఎలాన్ మస్క్ వంటి ఉన్నతస్థాయి ఆహూతుల కరతాళధ్వనుల మధ్య ట్రంప్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత్-పాక్ ఒప్పందానికి కృషి చేసిన యంత్రాంగం పట్ల గర్వంగా ఉన్నానన్నారు. సౌదీ అరేబియా పర్యటనలో భాగంగా రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు సౌదీ అరేబియా యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ స్వాగతం పలికారు. అక్కడే గ్రాండ్ హాల్‌లో ట్రంప్‌తో పాటు ఆయన అనుచర బృందంలోని అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వాణిజ్య మంత్రి హొవర్డ్ లుట్నిక్, ఇంధనశాఖ మంత్రి క్రిస్ రైట్ తదితరులకు సంప్రదాయ అరబిక్ కాఫీని అందించారు. అంతకు ముందు ట్రంప్ అధికార విమానం ఎయిర్‌ఫోర్స్ వన్ రియాద్ గగనతలంలోకి రాగానే రాయల్ సౌదీ ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన ఎఫ్-15ఎస్ విమానాలు గౌరవ స్వాగతం పలికాయి. ఇరాన్ అణుకార్యక్రమం, గాజాలో యుద్ధంపై ట్రంప్, సల్మాన్ చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆర్థిక, ద్వైపాక్షిక సహకారం, సైనిక రంగాలకు సంబంధించిన డజనుకు పైగా ఒప్పందాలను కుదుర్చుకున్నారు. మరోవైపు నూతన అణు ఒప్పందం కోసం ఇరాన్‌పై ఒత్తిడి తెస్తున్న ఆయన ఆ దేశాన్ని కొత్త, ఉత్తమ మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. రాజభవనంలోని విలాసవంతమైన రాయల్ కోర్టులో ట్రంప్, యువరాజు సల్మాన్ హాజరైన అతిథులతో కలిసి విందులో పాల్గొన్నారు. ఇందులో అమెజాన్, ఎన్విడియా, ఓపెన్ ఏఐ, ఉబెర్, కోకాకోలా, గూగుల్, బోయింగ్ సీఈవోలు పాల్గొన్నారు. టెస్లా సారథి మస్క్ కూడా హాజరయ్యారు. వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు ఖతార్ పాలకులు విలాసవంతమైన విమానాన్ని బహుమతి ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ గిఫ్ట్ అందుకోనుండటంపై ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి బహుమతిని అంగీకరించకపోవడం ముర[illegible]త్వమే అవుతుందన్నారు. సోమవారం వైట్‌హౌస్ వద్ద ఈ బహుమతికి సంబంధించి విలేకరులు అడిగిన ప్రశ్నలకు ట్రంప్ బదులిచ్చారు. ఈ విమానం అందుకోవడం అన్నది గొప్ప విషయంగా ట్రంప్ అభివర్ణించారు. అయితే, ఈ గిఫ్ట్ ద్వారా ఖతార్ రాయల్ ఫ్యామిలీ ఏమైనా లబ్ధి పొందనుందా? భద్రతాపరమైన సమస్యలు తలెత్తుతాయా? అనే విషయాలను ఆయన కొట్టిపారేశారు. 'నేను ఇలాంటి ఆఫర్‌ను ఎప్పటికీ తిరస్కరించను. ఉచితంగా ఖరీదైన విమానాన్ని ఇస్తున్నప్పుడు వద్దనడానికి నేను ఏమైనా తెలివితక్కువ వాడినా?' అని పేర్కొన్నారు. ఇక, అధ్యక్ష కాలం ముగిసిన తర్వాత ఈ విమానాన్ని వ్యక్తిగతంగా ఉపయోగించుకుంటారా? అని ఒక విలేకరి ప్రశ్నించారు. దీనిపై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వారు ఫ్రీగా జెట్ విమానం ఇస్తుంటే లేదు లేదు. నాకు ఫ్రీగా వద్దు. దీనికి మీకు 1 బిలియన్ డాలర్లు లేదా 400 మిలియన్ డాలర్లు చెల్లిస్తానని చెప్పాలా' అని ట్రంప్ ఘాటుగా బదులిచ్చారు. అనంతరం ఈ విమానాన్ని భవిష్యత్తులో అధ్యక్ష లైబ్రరీకి విరాళంగా ఇస్తామన్నారు.



### ఉద్యోగుల సమస్యలు

## పరిష్కరించాలి

- వారిని జనంలో పలుచన చేయడం సీఎం మానుకోవాలి
- తెలంగాణ ఎంప్లాయిూస్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్

**హైదరాబాద్:** రాష్ట్రంలో ఉద్యోగుల కనీస సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఎంప్లాయిూస్ కోఆర్డినేషన్ కమిటీ డిమాండ్ చేసింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఉద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీని అమలు చేయలేదని విమర్శించింది. ప్రజల ముందు ఉద్యోగులను పలుచన చేసేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మీడియా ఎదుట మాట్లాడటం సరికాదని, మానుకోవాలని పేర్కొంది. గతంలో తెలంగాణ ఉద్యమంలో ఉన్న పలువురు ఉద్యోగ సంఘాల నేతలం తెలంగాణ ఎంప్లాయిూస్ కోఆర్డినేషన్ కమిటీగా ఏర్పడినట్లు శాసనమండలి మాజీ ఛైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు. మంగళవారం ఇక్కడ విలేకరుల సమావేశంలో ఈ విషయం తెలియజేశారు. ఉద్యోగులు ప్రభుత్వాన్ని అడగలేని స్థితిలో ఉన్నారని, ఈ నేపథ్యంలో వారి సమస్యలపై పోరాడితేనే పెన్షనర్లుగా తమకూ వర్తిస్తాయన్న ఆలోచనతో తామంతా కమిటీగా ఏర్పడ్డామని తెలిపారు. దీనికి ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేదని తెలిపారు. కమిటీ ప్రతినిధి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా తెలంగాణలో ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. "ఉద్యోగి పదవీ విరమణ పొందుతున్న సమయంలో వచ్చే సొమ్ముతో ఇల్లు కట్టుకోవాలని, పిల్లల పెళ్లిళ్లు చేయాలని... ఇలా ఎన్నో ఆశలతో ఉంటారు. వాటిని చెల్లించకుండా ఉద్యోగులను మానసికంగా కుంగదీస్తున్నారు. రెండేళ్లుగా ప్రభుత్వం ఏం చేస్తోంది" అని ప్రశ్నించారు. కరోనా సమయంలోనూ భారాస ప్రభుత్వం జీతాలిచ్చిందని, ఒప్పంద ఉద్యోగులకూ పీఆర్సీ 30శాతం ఇచ్చిందని తెలిపారు. త్వరలో గవర్నర్‌ను కలుస్తామని తెలిపారు. విలేకరుల సమావేశంలో కోఆర్డినేషన్ కమిటీ నేతలు దేవీప్రసాద్, రవీందర్‌రెడ్డి, విఠల్, సుధాకర్‌రెడ్డి, సుమిత్ర, భుజంగరావు, విజయలక్ష్మి, విష్ణువర్ధన్‌రావు, లక్ష్మణ్ తదితరులు మాట్లాడారు.



### వన్యప్రాణులకు

## ముప్పు కలగొద్దు

### : మంత్రి సురేఖ

**హైదరాబాద్:** అగ్ని ప్రమాదాల నుంచి అటవీ ప్రాంతాలు, అందులో ఉండే వన్యప్రాణుల సంరక్షణకు అవసరమైన అన్నిరకాల చర్యలు తీసుకోవాలని అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారుల్ని ఆదేశించారు. అరణ్యభవన్ ఉన్నతాధికారులు, అన్ని జిల్లాల అధికారులతో సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిప్పుతో వన్యప్రాణులకు ముప్పు కలగొద్దని స్పష్టం చేశారు. వాటికి వేసవిలో నీరు, ఆహారం విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని అధికారులకు నిర్దేశించారు. పెద్ద అగ్ని ప్రమాదాలు జరిగితే వాటిని నివారించేందుకు అన్ని పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగారు. కొన్ని జిల్లాల్లో ఎక్కువగా అగ్ని ప్రమాదాలు జరగడానికి కారణాలేమిటో అడిగి తెలుసుకున్నారు. అడవుల్లో, జూపార్కుల్లో వన్యప్రాణుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్టు అధికారులు మంత్రికి వివరించారు. హైదరాబాద్‌లోని నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సురేఖ సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వన్యప్రాణులకు దోసకాయ, పుచ్చకాయ వంటి వాటిని అందించాలని సూచించారు.

# పదవీ విరమణ చేసిన జస్టిస్ సంజీవ్ ఖన్నా

- ఘనంగా వీడ్కోలు పలికిన బార్ అసోసియేషన్
- తదుపరి ఎలాంటి పదవులు చేపట్టబోనన్న ఖన్నా
- నేడు సుప్రీం చీఫ్ జస్టిస్‌గా గవాయ్ ప్రమాణం
- రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణం చేయించనున్న ముర్ము



**న్యూఢిల్లీ, మే 13 :** భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా పదవీకాలం మంగళవారం తో ముగిసింది. సుప్రీంకోర్టులో చివరి రోజు బెంచ్ కార్యలాపాలు ముగిసిన తర్వాత ఏర్పాటు- చేసిన కార్యక్రమంలో జస్టిస్ ఖన్నా మాట్లాడారు. తదుపరి ఎటువంటి అధికారిక పదవులను చేపట్టనని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థలోనే ఏదైనా చేయాలనుకుంటున్నానని చెప్పారు. మరోవైపు జస్టిస్ ఖన్నా పదవీ విరమణ నేపథ్యంలో సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేసింది. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా గతేడాది నవంబర్ 11 బాధ్యతలు చేపట్టారు. జస్టిస్ సంజీవ్ ఖన్నాకు దివంగత మాజీ న్యాయమూర్తి జస్టిస్ హెచ్.ఆర్.ఖన్నా సమీప బంధువు. 2005లో దిల్లీ హైకోర్టు అదనపు జడ్జీగా నియమితులైన జస్టిస్ ఖన్నా.. ఆ మరుసటి ఏడాది శాశ్వత న్యాయమూర్తిగా ఉన్నతి పొందారు. 2019 జనవరి 18న సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, నవంబర్ 11న సీజేఐగా బాధ్యతలు చేపట్టారు. ఖన్నా పదవీవిరమణతో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ మే 14న బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ నూతన సీజేఐతో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. సీనియారిటీ పరంగా తన తర్వాత స్థానంలో ఉన్న జస్టిస్ గవాయ్ పేరును.. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా గతంలోనే సిఫారసు చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 6 నెలలకుపైగా సీజేఐ పదవిలో కొనసాగనున్న జస్టిస్ గవాయ్.. నవంబరు 23న పదవీ విరమణ చేస్తారు. డీవై చంద్రచూడ్ పదవీ విరమణతో ప్రస్తుత సీజేఐ సంజీవ్ ఖన్నా 2024 నవంబర్‌లో ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. భారత 51వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ సంజీవ్ ఖన్నా ఆరు నెలలు మాత్రమే సేవలందించారు. దీంతో ఆయన పదవీ కాలం ముగిసింది. ఈ క్రమంలో భారత 52వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ గవాయ్ నేడు రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.జస్టిస్ సంజీవ్ ఖన్నా.. న్యూఢిల్లీలో 1960, మే 14న జన్మించారు. ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన క్యాంపస్ లా సెంటర్‌లో న్యాయశాస్త్రాన్ని చదివారు. ఢిల్లీ హైకోర్టులో 2005లో అదనపు న్యాయమూర్తిగా నియమితుల య్యారు. 2006లో శాశ్వత జడ్జి అయ్యారు. 2019, జనవరి 18న సుప్రీంకోర్టు జడ్జిగా పదోన్నతి పొందారు. సుప్రీంకోర్టు జడ్జిగా ఆయన పలు ప్రముఖ తీర్పుల్లో భాగస్వామిగా ఉన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్‌ల వినియోగాన్ని ఆయన సమర్థిస్తూ.. అవి పూర్తి భద్రమైనవని, దాని వల్ల బోగస్ ఓట్లు, బూత్‌ల రిగ్గింగ్‌ను అరికట్టవచ్చునని పేర్కొన్నారు. అలాగే ఎలక్టోరల్ బాండ్లపై సంచలన తీర్పు ఇచ్చిన సుప్రీంకోర్టు ఐదుగురు సభ్యుల ధర్మాసనంలో ఖన్నా కూడా ఉన్నారు. 370 అధికరణ రద్దును సమర్థిస్తూ తీర్పు ఇచ్చిన ధర్మాసనంలో కూడా ఆయన సభ్యుడే. కాగా తదుపరి సీజేఐగా జస్టిస్ గవాయ్ పేరును సీజేఐ ఖన్నా ఏప్రిల్ 16న కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. 2019 మే 24న సుప్రీంకోర్టుకు పదోన్నతిపై వచ్చిన జస్టిస్ గవాయ్ సీజేఐగా ఆరు నెలలకుపైగా కొనసాగుతారు. 2025 నవంబర్ 23న ఆయన పదవీ విరమణ చేస్తారు. జస్టిస్ కేజీ బాలకృష్ణన్ తర్వాత సీజేఐగా బాధ్యతలు చేపట్టనున్న రెండో దళిత న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ కావడం విశేషం. గవాయ్ పూర్తిపేరు భూషణ్ రామకృష్ణ గవాయ్. 1960 నవంబర్ 24న మహారాష్ట్రలోని అమరావతిలో జన్మించిన జస్టిస్ గవాయ్.. 1985 మార్చి 16న బార్‌లో సభ్యుడిగా చేరారు. 2003 నవంబర్ 14న బాంబే హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. 2005 నవంబర్ 12న అదే హైకోర్టులో శాశ్వత న్యాయమూర్తిగా నియమితులయ్యారు. అనేక చరిత్రాత్మక తీర్పులను వెలువరించిన సుప్రీంకోర్టుకు చెందిన పలు రాజ్యాంగ ధర్మాసనాలలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. పూర్వ జమ్మూ కశ్మీరు రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370 అధికరణను రద్దు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఏకగ్రీవంగా సమర్థించిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ గవాయ్ కూడా ఉన్నారు. రాజకీయ పార్టీలకు నిధులను సమకూర్చే ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ సభ్యుడిగా ఉన్నారు. రూ. 1000, రూ. 500 నోట్లను రద్దు చేస్తూ కేంద్రం 2016లో తీసుకున్న నిర్ణయాన్ని 4:1 మెజారిటీతో ఆమోదించిన మరో ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ పాత్ర ఉంది. ఎస్సీల వర్గీకరణ చేపట్టేందుకు రాష్ట్రాలకు అధికారాలను అందచేస్తూ 6:1 మెజారిటీతో తీర్పును వెలువరించిన ఏడుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనంలో కూడా జస్టిస్ గవాయ్ ఉన్నారు. జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఓ ముఖ్యమైన తీర్పును వెలువరిస్తూ 15 రోజుల ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఏ ఆస్తినీ కూల్చరాదని ఆదేశిస్తూ దేశవ్యాప్తంగా మార్గదర్శకాలు జారీచేసింది. అడవులు, వన్యప్రాణులు, చెట్ల పరిరక్షణకు సంబంధించిన అంశాలను విచారించే ధర్మాసనాలకు ఆయన సారథ్యం వహిస్తున్నారు. హైదరాబాద్‌కు చెందిన సెంట్రల్ వర్సిటీ భూములకు సంబంధించి కూడా ఆయన తీర్పును వెలువరించారు.



## సంక్షేమ హాస్టళ్లలో మెరుగైన వసతులు

- విద్యా సంవత్సరానికి ముందే ఏర్పాట్లు
- అధికారులను ఆదేశించిన సిఎస్ రామకృష్ణారావు

**హైదరాబాద్, మే 13 :** సంక్షేమ వసతి గృహాలలో మెరుగైన సేవలు అందించడానికి తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. విద్యార్థులకు అందించే కాస్మొటిక్ ఛార్జీల చెల్లింపులను నేరుగా విద్యార్థుల బ్యాంక్ అకౌంట్ లోకి జమ చేసేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించడం వల్ల విద్యార్థులకు బ్యాంకింగ్ సేవలపై అవగాహన ఏర్పడుతుందని ఆయన అన్నారు. మంగళవారం సచివాలయంలో సీఎస్ రామకృష్ణారావు అధ్యక్షతన రాష్ట్రంలోని ప్రభుత్వ సాంఘిక, గిరిజన, మైనారిటీ- వసతి గృహాల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలోని వివిధ సోషల్ వెల్ఫేర్, మైనారిటీ- వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, రెసిడెన్షియల్ హాస్టల్స్ సౌకర్యాలపై చర్చించారు. రాబోయే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ వసతి గృహాలకు సరిపడ నాణ్యమైన సరుకులు, విద్యార్థుల టెక్స్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్, బెడ్ షీట్లు, కార్పెట్స్, స్కూల్ బ్యాగ్స్ తదితర సామగ్రి సమకూర్చుకునేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇక వారికి అందించే సరుకుల క్వాలిటీ విషయంలో ఎలాంటి రాజీపడొద్దని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారని, అందుకు తగ్గట్టుగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలని సీఎస్ రామకృష్ణారావు అధికారులకు సూచించారు.

## గొంతులో మటన్ ముక్క ఇరుక్కుని వృద్ధుడు మృతి

**మహబూబాబాద్, మే 13 :** గొంతులో మటన్ ముక్క ఇరుక్కొని అస్వస్థతకు గురై వృద్ధుడు మృతిచెందిన ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని కొత్తతండాలో చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్ జిల్లా వర్ధన్నపేట శివారు డీసీ తండాకు చెందిన జాటోత్ లక్ష్మణ్(68) కొత్త తండాలో దుర్గా మాత పండుగ కోసం బంధువుల ఇంటికి వచ్చాడు. భోజనం చేసే క్రమంలో ఎముక ముక్క గొంతులో ఇరుక్కోవడంతో హుటాహుటిన ప్రభుత్వ దవాఖానకు తరలిస్తున్న సమయంలో మృతిచెందాడు. లక్ష్మణ్ మృతితో డీసీ తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## తిరుమలలో రేపటి నుంచి సిఫారసు లేఖలకు అనుమతి

### మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వెల్లడి

**తిరుమల, మే 13 :** తిరుమలలో గురువారం నుంచి వీఐపీ సిఫారసు లేఖలు స్వీకరిస్తామని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. తెలుగురాష్ట్రాల ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలపై 15 నుంచి నుంచి బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పారు. కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి అనునిత్యం ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు.. ఇక, సెలవు రోజుల్లో ఆ సంఖ్య మరింత భారీగా ఉంటుంది.. వేసవి సెలవుల నేపథ్యంలో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని.. సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా.. సిఫార్సు లేఖలపై శ్రీవారి బ్రేక్ దర్శనాలను రద్దు చేస్తూ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్ణయం తీసుకుంది. అయితే, తిరుమలలో భక్తుల రద్దీ సాదారణంగానే ఉంది.. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల రద్దీ తగ్గిన నేపథ్యంలో టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.. శ్రీవారి బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలను తిరిగి స్వీకరించాలని నిర్ణయించింది. మే 15వ తేదీ నుంచి.. సిఫార్సు లేఖలపై బ్రేక్ దర్శనాలు కేటాయింపు పునః ప్రారంభించనున్నట్టు పేర్కొంది.. మే 1 నుంచి జులై 15 వరకు సిఫారసు లేఖల బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు గతంలో తితిదే ప్రకటించింది. ప్రజాప్రతినిధులు, తితిదే బోర్డు సభ్యుల సిఫార్సు లేఖలు చెల్లవని వెల్లడించింది. ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే బ్రేక్ దర్శనాలు ఉంటాయని చెప్పింది. వేసవి సెలవుల దృష్ట్యా తితిదే ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. ఆ గడువును తగ్గించి మే 15 నుంచి ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు స్వీకరిస్తామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు.



## ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కండి

### వరంగల్ నేతలకు కేటీఆర్ పిలుపు

**హైదరాబాద్, మే 13 :** తెలంగాణ రాష్ట్రాన్ని పీడిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై వరుస పోరాటాలకు సిద్ధం కావాలని కెటిఆర్ పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్ ద్రోహాన్ని ప్రజలకు వివరించండి అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలతో నిర్వహించిన కీలక సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. వాగు దాటే దాక ఓడ మల్లన్న.. వాగు దాటినంక బోడి మల్లన్న అన్నట్టు- రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన ఉందన్నారు. వరంగల్ సభతో కాంగ్రెస్ అంతానికి ఆరంభం మొదలైంది.. కాంగ్రెస్ అరాచకాలను ఒక్క బీఆర్ఎస్ పార్టీ మాత్రమే ఎదుదుర్కొం టుందని కేటీఆర్ తెలిపారు. అయితే, రైతుల ఆత్మహత్యలు, వారి సమస్యల పరిష్కారంపై రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీ విస్తృతంగా పోరాటాలు చేసేందుకు సిద్ధమవుతుందని కేటీ-ఆర్ పేర్కొన్నారు. మోసానికి మారుపేరైన కాంగ్రెస్ నైజాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగడతామని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలును ఎలా విస్మరించిందో ప్రజలకు వివరిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో నెలకున్న సమస్యలను ప్రజలకు తెలిసేలా బీఆర్ఎస్ ముందుకు సాగుతుందని కేటీఆర్ వెల్లడించారు.

## పాలన అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోయడం కాదు

(మొదటిపేజీ తరువాయి)



కొనుగోలు కేంద్రాల్లో వేసిన తూకం కంటే మిల్లర్లు తక్కువ ధాన్యాన్ని చూపుతూ రైతులకు నష్టం కలిగిస్తున్నారన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించడానికి 3-4 రోజులు, మిల్లుల దగ్గర అన్‌లోడ్ చేయడానికి మరిన్ని రోజులు ఆలస్యం జరుగుతందని.. ఫలితంగా రైతులకు తీవ్ర నష్టం కలుగుతుందని ఆవేనద వ్యక్తం చేశారు. ఆన్‌లైన్ ట్రక్ షీట్ విధానం అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పినా ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పండిన పంటను అమ్ముకోవడానికి రైతులు 10-10 రోజులు కొనుగోలు కేంద్రాల్లో వేచి చూడాల్సిన దుస్థితి ఎదురైందని.. ఈ ప్రభుత్వం మాటలు ఘనం చేతలు శూన్యం అంటూ విమర్శలు గుర్పించారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేకపోవడం వల్ల రోజుల తరబడి ఎండలో వేచి చూడడం వల్ల రైతులు పిట్టల్లా రాలిపోతున్నారన్నారు. మే 13న మహబూబాబాద్ జిల్లా పోచంపల్లిలో గగులోతు కిషన్ మృతి చెందారని, 15న జగిత్యాల జిల్లా కథలాపూర్‌లో జలపతి రెడ్డి చనిపోయారని తెలిపారు. ఏప్రిల్ 21న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు చెర్లపాలెంలో హనుమండ్ల ప్రేమలత మృతి, ఏప్రిల్ 22న నెల్లికుదురు మండలం మదనతుర్తిలో బిర్రు వెంకన్న, 26న సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం ఆకునూరులో చింతకింది హనుమయ్య మృతి చెందారన్నారు. ధాన్యపు రాశులే సాక్షంగా.. కొనుగోలు కేంద్రాల్లోనే జరుగుతున్న ఈ రైతు మరణాలు ప్రభుత్వపు హత్యలేనన్నారు. ఇవి సహజ మరణాలు కావు, ముమ్మాటికీ కాంగ్రెస్ నిర్లక్ష్యంతో జరిగినవే హత్యలేనని ఆరోపించారు. దీనికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. అందాల పోటీల మీద పోలీస్ కమాండ్ కంట్రోల్, జూబ్లీహిల్స్ ప్యాలస్‌లో రివ్యూలు పెడుతున్నారని.. సెక్రటేరియట్ ముఖం కూడా ముఖ్యమంత్రి చూడడం లేదని విమర్శించారు. రైతు సమస్యలపై ఎందుకు ముఖ్యమంత్రి రివ్యూ పెట్టడం లేదని ప్రశ్నించారు. బ్రవరి నెలలో కట్టాల్సిన రైతు బీమా ప్రీమియం కట్టకపోవడం వల్ల చనిపోయిన రైతులకు రైతు బీమా అందడం లేదని మండిపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు వివిధ జిల్లాల్లో ధాన్యం కొనుగోలుపై రైతులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. నాగర్ కర్నూలు జిల్లా జటప్రోలులో అకాల వర్షానికి తడవడంతో రైతులు రాస్తారోకో చేశారని.. తడిసిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనాలని డిమాండ్ చేశారని హరీశ్‌రావు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల గ్రామంలో సన్న వడ్ల కొనుగోలు లేకపోవడంతో రైతులు సిరిసిల్ల-సిద్దిపేట రహదారిపై ధర్నా చేశారని చెప్పారు. వనపర్తి పట్టణంలోని చిట్యాల మార్కెట్ యార్డు వద్ద వర్షాలకు వేలాది బస్తాల వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిందని.. కాంటా జాప్యం, తరలింపు ఆలస్యాన్ని నిరసిస్తూ ఆందోళన చేపట్టారన్నారు. ఆదిలాబాద్ జిల్లా ఎర్వ చింతల్‌లో తూకంలో మోసాలపై పీఏసీఎస్ నిర్వాహకులను రైతులు ఘోరావ్ చేసి తక్షణ చర్యలకు డిమాండ్ చేశారని తెలిపారు. రైతులు ఎండకు ఎండి వానకు తడిచిపోతుంటే ఎందుకు ప్రభుత్వం మొద్దు నిద్రపోతున్నదని.. ప్యాలెస్‌లో అందాల పోటీ-లపై రివ్యూలా..ఝ మిమ్మల్ని నమ్మి ఓట్లు- వేసినా రైతులకు ఏమో మోసమా మండిపడ్డారు. వరంగల్ రైతు డిక్లరేషన్ లో ఇచ్చిన ఏ ఒక్క హామీ అయినా అమలు చేశారా? అంటూ నిలదీశారు. రైతు డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలకు రాహుల్ గాంధీ సాక్షియమన్నారు. రాహుల్ గాంధీ వరంగల్‌లో రైతులకు ఇచ్చిన హామీలపై ఏమని సమాధానం చెబుతారని ప్రశ్నించారు. ఇచ్చిన హామీలు అమలు చేయమని ముఖ్యమంత్రి అడిగితే ఢిల్లీకి వెళ్తే చెప్పులు ఎత్తుకెళ్లే వారిలా చూస్తున్నారని.. ఎవ్వడు నమ్మి అప్పు ఇవ్వట్లేదు అంటు-న్నారన్నారు. చివరికి పాకిస్తాన్‌ని నమ్మి అప్పు ఇస్తున్నారు కానీ రేవంత్ రెడ్డిని నమ్మి అప్పు ఇవ్వడం లేదన్నారు. ప్రతిపక్షం మీద బురదజల్లబోయి నువ్వు తీసుకున్న గోతిలో నువ్వేపడ్డావు అంటూ మండిపడ్డారు. ప్రభుత్వాన్ని నడపడం అంటే ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోసినంత సులువు కాదని.. ఇప్పటి-కై-నా ముఖ్యమంత్రి పాలనపై దృష్టి సారించి, రైతుల కష్టాలను తీర్చాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మంత్రులు, అధికారులు క్షేత్రస్థాయిలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు నష్టం జరగకుండా చూడాలని.. సీఎం అసెంబ్లీలో ఉపన్యాసాలు ఇచ్చుడు కాదని.. తరుగు, తాలు పేరు మీద ఐదు నుండి పది కిలోలు తరుగు తీస్తున్నారు కాబట్టి తరుగు లేకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తుందని హెచ్చరిస్తున్నామన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిఎస్పీ

### సోదాలు చేయగా ఇంట్లో వంద బుల్లెట్లు లభ్యం

**హైదరాబాద్, మే 13 :** ప్రజలకు అండగా ఉంటూ అక్రమాలను అరికట్టాల్సిన పోలీసు అధికారులే అవినీతికి పాల్పడుతున్నారు. లంచాలకు అలవాటు పడి పేద ప్రజలను వేధిస్తున్నారు కొందరు పోలీసు అధికారులు. తాజాగా ఓ డీఎస్పీ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. సూర్యాపేట డిఎస్పి పార్థసారథి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు దొరికిపోయాడు. దీంతో హయత్ నగర్‌లోని ఆయన నివాసంతో పాటు- మరికొన్నిచోట్ల ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. డీఎస్పీ పార్థసారథి ఇంట్లో అక్రమంగా 100 బుల్లెట్లు- ఉన్నట్లు- గుర్తించారు. అంతేకాకుండా, ఆయన ఇంట్లో భారీగా ఆస్తులకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను కూడా గుర్తించారు. ఇల్లీగల్గా బుల్లెట్స్ ఉండడంతో ఏసీబీ అధికారులు హయత్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉ-ూ పార్థసారథిపై హయత్ నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## రాష్ట్రంలో చురుకుగా ధాన్యం కొనుగోళ్లు

**హైదరాబాద్, మే 13 :** తెలంగాణ రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్ల పక్రియ వేగంగా కొనసాగుతోందని ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 61.45 శాతం యాసంగి వడ్ల కొనుగోళ్లు పూర్తి అయినట్లు- పేర్కొనింది. మే 12వ తేదీ నాటికి రాష్ట్రవ్యాప్తంగా 43.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది అన్నారు. ఇక, 2023- 24 సంవత్సరం ఇదే సమయానికి 29.88 లక్షల టన్నుల ధాన్యం కొనుగోళ్లు పూర్తయ్యాయి.. 2022-23లో 19.62 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు చేపట్టినట్లు- చెప్పుకొచ్చారు. అయితే, గత ఏడాదితో పోలిస్తే యాసంగి సీజన్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ఎక్కువ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు- చేసిందని తెలంగాణ ప్రభుత్వం తెలిపింది. 2023- 24లో 7,178 కేంద్రాలు ఏర్పాటు- చేయగా.. ఈసారి 8,245 కేంద్రాలు నెలకొల్పింది. ఈ ఏడాది యాసంగిలో రాష్ట్రవ్యాప్తంగా రికార్డు స్థాయిలో 60.14 లక్షల ఎకరాల్లో వరి సాగైంది.. మొత్తం 1.29 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. మొత్తం 70.13 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని తెలంగాణ ప్రభుత్వం అంచనా వేసింది.

## ఈతకు వెళ్లిన ఐదురుగు బాలుర గల్లంతు

**కడప, మే 13 :** వైఎస్ఆర్ కడప జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. చెరువులోకి ఈతకు వెళ్లిన ఐదుగురు బాలురు గల్లంతయ్యారు. వారిలో ఒకరి మృతదేహం లభ్యమైంది. చెరువులో గల్లంతైన మిగతా వారి కోసం పోలీసులు, గ్రామస్తులు గాలిస్తున్నారు. చెరువు వద్ద ఐదుగురు బాలురికి సంబంధించిన దుస్తులు ఉండడంతో ఐదుగురు నీట మునిగి నట్లు- భావిస్తున్నారు. ఈ విషాద ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## సిబిల్ స్కోర్‌తో సంబంధం లేదు

(మొదటిపేజీ తరువాయి)

ఈ స్కీమ్‌కు సంబంధించి మండల స్థాయిలో ప్రాసెస్‌ను ప్రారంభమైందని.. జూన్ రెండవ తేదీ కల్లా లబ్ధిదారులకు మంజూరు లెటర్లు అందజేస్తామన్నారు. నిరుద్యోగ యువత తలెత్తుకొని బతికెందుకు రాజీవ్ యువ వికాస పథకాన్ని తీసుకొచ్చామని చెప్పారు. మంగళవారం భద్రాద్రి కొతగూడెం జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని బయ్యారం, టేకులపల్లి మండలాల్లో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు భట్టి శంఖుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం లాంటి స్కీమ్ భారత దేశంలోనే ఎక్కడ లేదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ యువకులు వాళ్ల కాళ్ళ మీద వాళ్ళు నిలబడేందుకు స్వయం ఉపాధి అవకాశాన్ని ఎంచుకొని ఎదగడానికి రాజీవ్ యువ వికాసం స్కీమ్ ఒక వరం లాంటిదన్నారు. పది సంవత్సరాలు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఎలాంటి భృతిని, ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని మండిపడ్డారు. గత పది సంవత్సరాలు తెలంగాణ యువత నిరాశ నిస్పృహల్లో బతికిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 52,000 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. మిగిలిన ఉద్యోగాల భర్తీకి కోసం జాబ్ క్యాలెండర్ ప్రకటించామని గుర్తు చేశారు. ఇల్లందు నియోజకవర్గంలోని తులారం ప్రాజెక్ట్, బయ్యారం పెద్ద చెరువు మరమ్మత్తులతో పాటు- ఇల్లందు ప్రాంతంలో సర్వే చేసి నివేదికను తయారుచేసి సీతారామ ప్రాజెక్టు ద్వారా నీళ్లందించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని తెలిపారు.

## ఐటి కమిషనర్ విషయంలో కీలక అంశాలు

### లంచంగా రూ.2.5కోట్ల విలువైన ప్లాట్ రిజిస్ట్రేషన్

**హైదరాబాద్, మే 13 :** ఇటీవల ముంబయిలో సీబీఐకి చిక్కిన హైదరాబాద్ ఆదాయపు పన్ను కమిషనర్ జీవన్‌లాల్ కేసు దర్యాప్తులో కీలక అంశాలు వెలుగులోకి వచ్చాయి. అతను రూ.70 లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సంగతి తెలిసిందే. ముంబయికి చెందిన ఎన్‌డీడబ్ల్యూ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి రూ.2.5కోట్ల విలువైన ప్లాట్‌ను లంచంగా తీసుకున్నట్లు- తేలింది. ఖమ్మం జిల్లాకు చెందిన బినామీ దండెల్ వెంకటేశ్వరుల పేరిట ఆ ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించినట్లు- అధికారులు గుర్తించారు. అంతేకాకుండా ముంబయిలోని మరో రెండు సంస్థల నుంచి రూ.35 లక్షలు లంచం తీసుకున్నట్లు సీబీఐ గుర్తించింది. ఈ సొమ్మును హవాలా ద్వారా స్వీకరించినట్లు దర్యాప్తు బృందం ఆధారాలు సేకరించింది. షాపూర్జీ పల్లోంజీ నిర్మాణ సంస్థ ట్యాక్సేషన్ ఫైల్ పెండింగ్‌ను క్లియర్ చేసేందుకు రూ.1.20 కోట్లు- లంచం డిమాండ్ చేసినట్లు సీబీఐకి స్పష్టమైన సమాచారం ఉంది. ఇద్దరు మధ్యవర్తుల ద్వారా రూ.15 లక్షలు లంచం తీసుకున్న జీవన్ లాల్.. మరో రూ.70 లక్షలు తీసుకుంటుండగా పక్కా ఆధారాలతో సీబీఐ అధికారులు పట్టుకున్నారు. వ్యవహారంలో మొత్తం 15 మందిపై సీబీఐ అధికారులు కేసులు నమోదు చేశారు. లంచం ఇచ్చిన వారిని కూడా నిందితులుగా చేర్చారు.

www.rajamudranews.com
రాజముద్ర
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక

# కాల్పుల విరమణపై విమర్శలు తగవు!




యుద్ధాన్ని అర్థాంతరంగా అపారు. అమెరికా పెత్తనమేంటి..? ఎవరిని అడిగి కాల్పులు ఆపారు.. ఎందుకు పాక్‌పై పూర్తిస్థాయి దాడికి పూనుకోలేదు. పాక్ జుట్టు చేతికి అందే సమయంలో మోడీ లొంగిపోయారు. ఇలా రకరకాల ప్రశ్నలు ఇప్పుడు మోడీ లక్ష్యంగా సంధిస్తున్నారు. ఇదే సమయంలో కాంగ్రెస్ వారు ఓ అడుగు ముందుకు వేసి ఆనాడు ఇందిరా గాంధీ ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గలేదని, నాటి ఆమె ప్రసంగాలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. నిజానికి మోడీ అమెరికా లేదా,పాక్‌కు తలొగ్గారని ఎవరైనా అనుకుంటే భ్రమే అవుతుంది. ఎందుకంటే ఆయన ప్రసంగం విన్నవారు ఈ భ్రమల నుంచి బయటపడాలి. మోడీ ఎక్కడా రాజీపడలేదు. అలాగే పాకిస్థాన్‌కు గతంలో కన్నా గట్టి దెబ్బ కొట్టారు. అంతే కాకుండా కాచుకో అని హెచ్చరించారు. తోక ఝాడిస్తే పాక్ మసవుతుందని నిరూపించారు. ఉగ్రవాదులను ఉసిగొల్పితే నేరుగా పాక్‌పై దాడి చేస్తామని హెచ్చరించారు. ఇక ఇందిర విషయానికి వస్తే..1971లో బంగ్లాదేశ్ విముక్తితో బాగుపడ్డది బంగ్లా తప్ప భారత్ కాదు. కొత్తగా దేశం అవతరించింది. అదికూడా మనకు పక్కలో బల్లెంలా తయారయ్యిందని ఇటీవలి ఘటనలు రుజువు చేస్తున్నాయి. అక్కడా హిందువులను ఊచకోత కోశారు. కనీస కృతజ్ఞత లేకుండా బంగ్లాదేశం నేతలు వ్యవహరిస్తున్నారు. ఇకపోతే ఆనాటి యుద్ధంలో 93వేల మంది పాక్ సైనికులు పట్టుబడితే ఉదారంగా వదిలేశారు. ఆనాడే పట్టుబట్టి పివోకెను స్వాధీన పరచుకునే అవకాశం ఉన్నా వదిలిపెట్టారు. ఇదీ ఇందిరాగాంధీ నిర్వాకం. ఆనాడు గట్టిగా బుద్ధి చెబితే ఇప్పుడు భారత్‌కు ఉగ్రవాదుల సమస్యలు వచ్చేవి కావు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తు పెట్టుకుంటే మంచింది. అన్నింటికన్నా ముఖ్య విషయమేంటంటే ఆపరేషన్ సింధూర్ కేవలం ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేసేందుకు మాత్రమే ఉద్దేశించినది. ఈ క్రమంలో పాక్ కాల్పులకు తెగబడగా మన సైనిక దళాలు మరో అడుగు ముందుకు వేసి పాక్‌ను చావుదెబ్బ కొట్టాయి. మరో వందేళ్లయినా కోలకుకోకుండా సర్వనాశనం చేశాయి. పహల్గాంలో ఉగ్రమూకలు కర్కశంగా దాడి చేసి 26 మందిని హతమార్చిన తర్వాత రగిలిపోయిన ప్రధాని పాకిస్థాన్‌పై దాడికి త్రివిధ దళాలను సిద్ధంచేసి ప్రతిదాడులకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి మోడీ తీసుకున్న నిర్ణయాలను ప్రపంచంతో పాటు దేశం కూడా శ్లాఘిస్తోంది. ఇంటా బయటా ఆయన ప్రతిష్ఠ అమాంతంగా పెరిగింది. పహల్గాంలో యాత్రికుల మతం తెలుసుకొని మరీ పురుషులను మాత్రమే చంపి మన మహిళల పసుపు కుంకుమలను ఉగ్రవాదులు చెరిపేయడంతో దేశ ప్రజలందరిలోనూ ప్రతీకారేచ్ఛ రగిలిపోయింది. పాకిస్థాన్‌కు సరైన గుణపాఠం చెప్పాల్సిందేనని దేశ ప్రజలంతా నినదించారు. దీంతో ఇదే అదనుగా భావించిన ప్రధానమంత్రి... పాక్‌పై ప్రారంభించిన ప్రతిదాడులకు 'ఆపరేషన్ సిందూర్' అని వ్యూహాత్మకంగా నామకరణం చేశారు. ఏ మహిళల నుదుటిపై సిందూరం తుడిచివేయబడిందో అదే సిందూరం పేరిట ఆపరేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆపరేషన్‌కు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియాకు తెలియజేసే బాధ్యతను ఇద్దరు మహిళా సైనికాధికారులకు అప్పగించారు. ప్రధాని మోదీ చతురతకు ఇది నిదర్శనంగా చెప్పుకోవాలి. ఈ క్రమంలో లక్ష్యం నెరవేరింది.

పాక్ గడ్డపై 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేశారు. తరవాత పాక్ దీనికి కట్టుబడి అభినందించకుండా ఉగ్రవాదులకు అండగా నిలిచింది. అకారణంగా భారత్‌పై కాల్పులకు తెగబడింది. దీంతో భారత్ ధీటుగా సమాధానం ఇవ్వండంతో చివరకు దానికి చావుదెబ్బ తప్పలేదు. ఎయిర్‌బేస్‌లు దెబ్బతిన్నాయి. అణుస్థావరంపై దాడి జరిగింది. చివరకు కోలుకోలేని స్థితిలో కాళ్లబేరానికి వచ్చింది. మనం నేరుగా చెబితే ఒప్పుకోమన్న భయంతో అమెరికాను వేడుకుంది. అమెరికా ద్వారా పాకిస్థాన్ రాయబారాలు నడిపి కాల్పుల విరమణకు ఒప్పించింది. శనివారం సాయంత్రం 5 గంటల నుంచి అనూహ్య రీతిలో ఇరు దేశాల మధ్య కాల్పుల విరమణ అమలులోకి వచ్చింది. ఇది ఒకరకంగా శుభ పరిణామంగా చూడాలి. ఎందుకంటే ఆపరేషన్ సింధూర్ ముగియలేదని మోడీ తేల్చారు. సైన్యం కూడా తేల్చింది. ఏమాత్రం అల్లరి జరిగినా ఈసారి దాడికి రెడీగా ఉంటామని, సింధూర్ ముగియలేదని తేల్చి చెప్పాం. ఉగ్రవాదాన్ని, చర్చలను ఒకేగాటిన కట్టలేమని చెప్పారు. నీళ్లను రక్తాన్ని కలిపి పారించలేమన్నారు. పివోకె, ఉగ్రవాదంపైనే తదుపరి చర్చలని కూడా మోడీ తేల్చారు. ఇవి గ్రహించకుండా పాక్పై కాల్పుల విరమణ గురించి విమర్శలు చేసేవారు గతాన్ని, ప్రస్తుతాన్ని గమనించి మాట్లాడితే మంచిది. ఇకపోతే పాక్ ఉగ్రవాదులు మత ప్రాతిపదికన మారణహోమం సృష్టించడం ద్వారా మన దేశంలో హిందువులను సంఘటితం చేశారు. ఫలితంగా ప్రధాని మోదీ అత్యంత శక్తిమంతమైన నేతగా అవతరించారు. మాకు మోదీ ఉన్నారన్న ధీమాలో ఇప్పుడు దేశ ప్రజలు ఉన్నారు. పాకిస్థాన్ గడ్డపై తిష్ఠవేసిన దాదాపు వంద మంది ఉగ్రవాదులను మట్టుబెట్టగలగడం మన దేశం సాధించిన విజయం. గతంలో పాకిస్థాన్‌పై మన దేశం రెండు పర్యాయాలు యుద్ధం చేయవలసి వచ్చింది. ఈ రెండు సందర్భాలలోనూ భారత దేశానిదే పైచేయి అయింది. కానీ ఇప్పుడు ఉన్నంతగా ఆనాడు పరిస్థితులు అనుకూలించలేదు. ఆనాడే పివోకేను ఇస్తేనే సైనికులను వదులుతామని ఇందిర చెప్పి వుంటే సమస్య ఇంతదాకా వచ్చేది కాదు.

భారత్‌తో నేరుగా తలపడి నెగ్గే పరిస్థితి లేనందున ఉగ్ర మూకల ద్వారా మన దేశంలో అలజడులు సృష్టించే ప్రయత్నం పాకిస్థాన్ చేస్తోంది. ఈ క్రమంలో పాక్‌లో తిష్ఠ వేసిన ఉగ్రవాదులు మరింత శక్తిమంతులుగా మారారు. పాకిస్థాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ ఐఎస్ఐ ద్వారా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారు. ఫలితంగా పాక్ మిలటరీకి, ఉగ్రవాద సంస్థలకు మధ్య విడదీయరాని బంధం ఏర్పడింది. తాము శత్రు దేశంగా పరిగణించే భారత్‌ను ఏదో చేయాలన్న దుగ్ధతో పాకిస్థాన్ తన తల కొరివిని తానే పెట్టుకుంటోంది. ఈ క్రమంలో ఇప్పుడు పహల్గామ్ దాడి తరవాత ఇక పాక్ ఉగ్రవాదులకు శిక్షణ ఇచ్చి దూకుడుగా భారత్‌పై దాడికి దిగే ఛాన్స్ తక్కువ. భారత్ అమ్ముల పొది ఏమిటో పాక్‌కు తెలిసి వచ్చింది. మళ్లీ ఇలాంటి ప్రయత్నం చేస్తే పాక్ ముక్కచెక్కలు కాక తప్పదు. అందుకు మోడీ వ్యూహంతోనే ఉంటారు. భారత రక్షణ దళాలు కూడా ఇప్పుడు అదే వ్యూహంతో సిద్దంగా ఉన్నాయి. ఇక్కడ అమెరికాకు తలొగ్గి సిందూర్‌ను నిలిపివేశారన్న విమర్శల నుంచి బయపటడి దేశం మొత్తంగా ఒక్కటే అన్న నినాదంతో ముందుకు సాగాల్సి ఉంది.

# కుడితిలో పడ్డ ఎలుకలా పాక్ పరిస్థితి

- సైన్యానికి, ఉగ్రవాదులకు తలొగ్గే దుస్థితి
- బలూచీ ఉద్యమం మరింత ఉధృతంతో భయం



**న్యూఢిల్లీ, మే 13 :** పాక్ పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారయ్యింది. భారత్ ప్రతిదాడితో ఇక ముమ్ముందు సాహసం చేసే పరిస్థితి లేకుండా చేసుకుంది. ఉగ్రవాదులకు తర్ఫీదు ఇవ్వడం, ఉసిగొల్పడం ద్వారా భారీ మూల్యం చెల్లించుకుంది. ఇకపోతే పాకిస్థాన్‌లో ప్రజా ప్రభుత్వం కంటే మిలటరీనే శక్తిమంతమైనది. సైన్యాన్ని ధిక్కరించి పాక్ ప్రధానమంత్రులు పదవిలో కొనసాగలేరని గతంలో అనేకమార్లు రుజువయ్యింది. గతంలో ఎంతో మంది సైన్యాధ్యక్షులు ప్రధానమంత్రులను తొలగించి పాలనా పగ్గాలు చేపట్టారు. అదే సమయంలో ఉగ్రవాద సంస్థలను కాదని స్వతంత్రంగా వ్యవహరించే పరిస్థితి సైన్యానికి కూడా లేదు. సైన్యాన్ని ఉగ్రవాదులు తమ అదుపులో పెట్టుకోగా, ప్రభుత్వాలను సైన్యం తన అదుపులో పెట్టుకుంటోంది. భారత్ ఉగ్రవాదులను మట్టుపెడితే వారికి పాక్ సైన్యం నివాళి అర్పించిందంటేనే ఎంతగా వారు దుస్థితిలో ఉన్నారో అర్థం చేసుకోవచ్చు. ఉగ్రవాదులను కట్టడి చేయాలనుకునే ప్రభుత్వాలకు మనుగడ ఉండదు. కొన్ని దశాబ్దాలుగా పాకిస్థాన్‌లో ఇదే పరిస్థితి ఉంది. ఫలితంగా పాకిస్థాన్ అన్ని విధాలుగా నష్టపోతోంది. ఆ దేశం ఆర్థికంగా దివాలా అంచున ఉంది. బయటి నుంచి ఆర్థిక సాయం అందని పక్షంలో పాక్ కుప్పకూలిపోతుంది. ఆర్థిక సంక్షోభం ఒకవైపు - అంతర్గత పోరు మ-రోవైపు ఆ దేశాన్ని కుంగదీస్తున్నప్పటికీ ఉగ్రవాదులు మతపరమైన ఉన్మాదంతో ఊగిపోతున్నారు. మరోవైపు పాకిస్థాన్‌లో దాదాపు 40 శాతం భూ భాగమైన బలూచిస్థాన్ స్వతంత్ర దేశంగా ఏర్పడాలని కోరుకుంటోంది. ఇందుకోసం బలూచీలు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ఈ తరుణంలో భారత్‌తో సయోధ్యకుమించిన మార్గం లేదు. అందుకే కాల్పుల విరమణకు పాక్ ముందుకు వచ్చింది. ఇందులో పాక్ రాయబేరమే ఎక్కువ. దానికి అంతర్జాతీయ మద్దతు కావాలి. రుణం కావాలి. అందుకే ట్రంప్ కాళ్లావేళ్లా పడి రుణం కోసం కాల్పుల విరమణకు సిద్ధపడింది. అయితే ఇది అక్కడి ఉగ్రవాదులకు, సైన్యానికి రుచించకున్నా తప్పని పరిస్థితి. మన దేశం 1971లో పాకిస్థాన్‌తో యుద్ధం చేసింది. అప్పుడే పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. మనకు 1947లో స్వాతంత్ర్యం÷-ర వచ్చిన తర్వాత రెండుసార్లు పాకిస్థాన్‌తో, ఒకసారి చైనాతో యుద్ధం చేయాల్సి వచ్చింది. 1971 తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు ఏర్పడటం, స్వల్ప స్థాయిలో దాడులు చేసుకోవడం మినహా పూర్తి యుద్ధం జరగలేదు. 1971లో జరిగిన యుద్ధం గురించి ఇప్పుడు అరవై ఏళ్ల వయసు ఉన్న వారికి కూడా పూర్తిగా తెలియదు. అయితే ఆనాడు బంగ్లాను కోల్పోయిన పాక్ ఇప్ఉడు మొండగా ముందకు వెళితే బలూచీని కూడా కోల్పోవడం ఖాయం. అందుకే బలూచీని కాపాడుకునే క్రమంలో కాల్పులకు దూరంగా ఉండడానికి కూడా ఓ కారణంగా చూడాలి.

# ధర్మ సంస్థాపన కోసం ఆయుధం పట్టాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

మన సైన్యం చేపట్టిన ఈ పరాక్రమం.. భారత్ సామర్థ్యానికి ప్రతిరూపమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ చూపిన ఈ పరాక్రమం.. త్రివిధ దళాల త్రివేణీ సంగమమన్నారు. పాకిస్థాన్‌కు భారత వాయుసేన తన సత్తా చాటిందంటూ ప్రశంసల జల్లు కురిపించారు. యుద్ధ క్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశామని.. ఈ జయ జయ ధ్వానాలు ప్రపంచమంతా విన్నదని ఆయన గుర్తు చేశారు. భారత్ మాతాకీ జై అనేది ప్రతీ పౌరుడి నినాదమని ప్రధాని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అణు బాంబు హెచ్చరికలను సైతం చిత్తు చేశామని చెప్పారు. దేశంలోని ప్రతీ పౌరుడూ గర్వపడేలా మీరు చేశారంటూ సైనికులను ఈ సందర్భంగా ప్రధాని మోదీ అభినందించారు. మీరందరూ చరిత్ర సృష్టించారంటూ సైనికులను వెన్నుతట్టి ప్రోత్సహించారు. మీ కోసమే నేను ఇక్కడికి వచ్చానని చెప్పారు. వీరులను చూసినప్పుడు జీవితం ధన్యమవుతోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.'భారత్ మాతాకీ జై' నినాదం శత్రువుల చెవుల్లో గింగిరాలు తిరుగుతోందని ప్రధాని మోదీ అన్నారు. అది శత్రువుల వెన్నులో వణుకు పుట్టించిందని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని మన సైన్యం శపథం చేసింది. మన సైన్యం చూపిన శక్తిసామర్థ్యాలకు ఎన్ని ప్రశంసలు చేసినా తక్కువే. అణు బ్లాక్‌మె-యిల్‌ను అపహాస్యం చేసింది. భారత శక్తిసామర్థ్యాలు చూసి నా జీవితం ధన్యమైంది. యుద్ధక్షేత్రంలోనూ భారత్ మాతాకీ జై నినాదాలు చేశాం. ఆకాశం నుంచి పాతాళం వరకు ఆ నినాదం మార్మోగింది. ఈ భూమి నుంచి వీర సైనికులు అందరికీ సెల్యూట్ చేస్తున్నా. ప్రతి భారతీయుడు సైన్యానికి మద్దతుగా నిలబడ్డాడు. భారత సేనలకు కృతజ్ఞతలు చెప్తున్నాడు. ధర్మసంస్థాపన కోసం ఆయుధం పట్టడం మన సంప్రదాయం.. మన విధానం. మన అక్కాచెల్లెళ్ల నుదుటి సిందూరం తుడిచినవాని నట్టింట్లోకి వెళ్లి నాశనం చేశాం అని ప్రధాని ఉద్వేగపూరిత ప్రసంగం చేశారు. ఆపరేషన్ సిందూర్, భారత్-పాక్ కాల్పుల విరమణకు అంగీకరించిన నేపథ్యంలో ఆయన పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిగా మన భద్రతా బలగాలు ఉగ్రస్థావరాలపై ఆపరేషన్ సిందూర్‌ను నిర్వహించాయి. అది జీర్ణించుకోలేని పాకిస్థాన్ మే 9, 10వ తేదీల్లో దాడులకు యత్నించింది. అయితే వాటిని మన సైన్యం సమర్థవంతంగా తిప్పికొట్టింది. దాయాది టార్గెట్ చేయాలని యత్నించిన వాటిలో ఆదంపుర్ వైమానిక స్థావరం కూడా ఒకటి. ఈ ఉదయం నేను





ఆదంపుర్ ఎయిర్‌బేస్‌కు వెళ్లాను. అక్కడ మన పోరాటయోధులను కలిశాను. ధైర్యం, దృఢ సంకల్పానికి ప్రతిరూపంగా నిలిచేవారితో మాట్లాడటం ఒక ప్రత్యేక అనుభవం. మన దేశ రక్షణ కోసం బలగాలు చేసే ప్రతిచర్యకు ప్రజలందరూ ఎప్పటికీ కృతజ్ఞతతో ఉంటారని ఎక్స్ వేదికగా మోదీ రాసుకొచ్చారు. అలాగే వారితో దిగిన చిత్రాలను షేర్ చేశారు. అక్కడికి వెళ్లి పాక్ చేసిన తప్పుడు సమాచారాన్ని తిప్పికొట్టారు. వాయుసేన సిబ్బందితో ముచ్చటించి భుజం తట్టారు. ఆపరేషన్ వివరాలను మోదీకి బలగాలు వివరించాయి. గంటన్నరకు పైగా ఆయన అక్కడే గడిపారు. ఆ సమయంలో ఆయన ధరించిన టోపీపై త్రిశూల్ చిత్రం కనిపించింది. ఆపరేషన్ సిందూర్ గురించి దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన మరుసటిరోజు మోదీ ఈ పర్యటన చేపట్టారు. నిన్న ప్రధాని మాట్లాడుతూ.. భారత్ ప్రళయభీకర దాడులను తట్టుకోలేకే పాకిస్థాన్ చివరకు కాల్పుల విరమణ పేరుతో కాళ్లబేరానికి వచ్చిందని వెల్లడించిన సంగతి తెలిసిందే. నవయుగ యుద్ధంలో పాకిస్థాన్‌ను భారత్ మట్టి కరిపించిందని, వారు సరిహద్దుల్లో యుద్ధానికి దిగితే మనం వాళ్ల గుండె పైనే కొట్టగలిగామన్నారు. ఆ దేశ ప్రవర్తనను పరిశీలిస్తామని, ముమ్ముందు ఏమాత్రం తేడా వచ్చినా ఊరుకోబోమని హెచ్చరించారు. పహల్గాంలో ఉగ్రవాదులు వికృత క్రూరత్వాన్ని ప్రదర్శించి.. కుటుంబ సభ్యుల ముందే అమాయక ప్రజలను చంపినందుకు ప్రతీకారంగా పాకిస్థాన్‌లోని ఉగ్ర సౌధాలను కుప్పకూల్చి 100 మందికి పైగా పేరుమోసిన ఉగ్రవాదులను అంతమొందించినట్లు- ప్రకటించారు. ఆ దేశంతో చర్చలంటూ జరిగితే ఉగ్రవాద నిర్మూలన, పాక్ ఆక్రమిత కశ్మీర్‌పై మాత్రమేనని స్పష్టంచేశారు. భారతదేశాన్ని, ప్రజలను రక్షించుకోవడానికి ఎంతపెద్ద నిర్ణయం తీసుకోడాని-కై-నా వెనుకాడబోమని పాక్‌కు తేల్చిచెప్పారు. ప్రధాని మోదీ షేర్ చేసిన చిత్రాల్లో చెక్కు చెదరకుండా ఉన్న ఎస్-400 రక్షణ వ్యవస్థ కనిపించింది. ఆదంపుర్‌లోని ఎస్-400 స్థావరాన్ని ధ్వంసం చేశామని పాక్ ప్రచారం చేసింది. భారత్‌లోని కీలకమైన మౌలిక సదుపాయాలు, విద్యుత్తు.. సైబర్ వ్యవస్థలపై దాడి చేసి ధ్వంసం చేశామని చెప్పింది. ఇదంతా హేయమైన దుష్ప్రచారం అని భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తప్పుబట్టిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ ఎయిర్‌బేస్‌కు వెళ్లి మోదీ దాయాది తప్పుడు ప్రచారానికి చెక్ పెట్టారు. అలాగే భద్రతాబలగాలకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ఈ పర్యటన ద్వారా గట్టి సందేశం ఇచ్చారు.

# ఆపరేషన్ సిందూర్‌తో భారీగా నష్టం

## మెల్లగా వాస్తవాలు అంగీకరిస్తున్న పాక్

## 11మంది సైనికులు చనిపోయారన ఆర్మీ వెల్లడి

**ఇస్లమాబాద్, మే 13 :** పహల్గామ్ దాడి తర్వాత భారత్ తీసుకున్న చర్యల కారణంగా పాకిస్తాన్ భారీ నష్టాలను చవిచూసింది. ఆపరేషన్ సిందూర్‌లో, పాకిస్తాన్‌లో పెంచి పోషించిన అనేక మంది భయంకరమైన ఉగ్రవాదులను నాశనం చేశారు. ఆ తర్వాత పాక్ భారత్ పై దాడి చేసింది. భారత్ జరిపిన ప్రతీకార దాడుల్లో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. పాకిస్తాన్ స్వయంగా దీనిని అంగీకరించింది. భారత సైన్యం జరిపిన దాడిలో 11 మంది పాకిస్తాన్ సైనికులు మరణించగా, 78 మంది గాయపడ్డారని పాకిస్తాన్ ఆర్మీ మీడియా విభాగం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పహల్గామ్ దాడి తర్వాత ఉగ్రవాదులను నిర్మూలిస్తామని భారత్ ప్రతిజ్ఞ చేసి ఆపరేషన్ సిందూర్ ప్రారంభించినప్పుడు భారత్, పాకిస్తాన్ మధ్య సైనిక ఘర్షణ జరిగింది. ఈ దాడిలో చాలా మంది పాకిస్తాన్ సైనికులు మరణించారు. డాన్ వార్తాపత్రిక ప్రకారం, మరణించిన పాకిస్తాన్ ఆర్మీ సైనికులలో నాయక్ అబ్దుల్ రెహ్మాన్, లాన్స్ నాయక్ దిలావర్ ఖాన్, లాన్స్ నాయక్ ఇక్రముల్లా, నాయక్ వకార్ ఖలీద్, సిపాయి ముహమ్మద్ ఆదిల్ అక్బర్, సిపాయి నిసార్ ఉన్నారు. భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ పాకిస్తాన్‌లోని ఉగ్రవాద లాంచ్ ప్యాడ్‌లను ధ్వంసం చేసింది. వైమానిక దాడిలో అనేక ఉగ్రవాద శిబిరాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. భారత్, పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తతలు, ఆపరేషన్ సింధూర్‌పై పాకిస్తాన్ ప్రభుత్వం, పాకిస్తాన రాజకీయ నేతలు తప్పుడు కథనాలను చెబుతూనే వస్తున్నారు. ఈ యుద్ధంలో పాకిస్తాన్ విజయం సాధించిందంటూ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చెప్పాడు. మ-రోవైపు, పాక్ వ్యాప్తంగా విక్టరీ ర్యాలీలు తీస్తున్నారు. ఈ ర్యాలీల్లో మాజీ క్రికెటర్ ఆఫ్రిదితో పాటు- పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. భారత్ ఓ వైపు క్లియర్‌గా శాటిలైట్ చిత్రాలతో పాకిస్తాన్‌కి జరిగిన నష్టాన్ని చూపిస్తుంటే, మరోవైపు తమకు ఏం కాలేదు, భారత్ తీవ్రంగా నష్టపోయిందని ఒక ఫేక్ ప్రచారాన్ని పాకిస్తాన్ చేస్తోంది. ఇదెలా ఉంటే, తాజాగా పాకిస్తాన్ ఉప ప్రధాని ఇషాక్ దార్ మాట్లాడుతూ.. భారత్ తమ 11 వైమానిక స్థావరాలపై క్షిపణి దాడి చేసినట్లు- అంగీకరించారు. భారతదేశంతో జరిగిన ఘర్షణల్లో పాకిస్తాన్ విమానాలు దెబ్బతిన్నట్లు- చెప్పాడు. పాకిస్తాన్ జెట్‌ని భారత్ కూల్చినట్లు స్పష్టమైన ఆధారాలతో వెల్లడించింది. అయితే, ఇషాక్ దార్ మాత్రం తమ జెట్ స్వల్పంగా దెబ్బతిన్నట్లు- అంగీకరించారు. భారత పైలట్ ఎవరూ కూడా పాకిస్తాన్ వద్ద లేరని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాకిస్తాన్ లోని చాలా కీలమైన ఎయిర్ బేస్‌లపై భారత్ తీవ్రంగా విరుచుకుపడింది. శనివారం తెల్లవారుజామున రావల్పిండిలోని నూర్ ఖాన్ ఎయిర్ బేస్‌తో సహా సర్గోదా, రఫికీ, జకోబాబాద్, స్కర్దు వంటి ఎయిర్ బేస్‌లపై విరుకుపడింది. మొత్తంగా భారత్ పాక్‌కి చెందిన 11 వైమానిక స్థావరాలను దెబ్బతీసింది. ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైన తర్వాత 35-40 మంది పాకిస్తాన్ సైనిక సిబ్బంది మరణించినట్లు- భారత డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

# కాశ్మీర్‌లో మళ్లీ ఉగ్రవాదుల ఏరివేత

**శ్రీనగర్, మే 13 :** పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి తర్వాత భారత సైన్యం ఉగ్రవాదులను మట్టుపెట్టే పనిలో పడింది. ఈ క్రమంలోనే ఆపరేషన్ సింధూర్ నిర్వహించి.. పాకిస్థాన్, పిఒకెలలోని ఉగ్ర స్థావరాలపై భారత్ దాడి చేసింది. మరోవైపు భద్రతా బలగాలు భారత్‌లో తలదాచుకున్న ఉగ్రవాదలను అంతం చేస్తున్నారు. తాజాగా జమ్మూకశ్మీర్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. షోపియాన్ ప్రాంతంలో జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబాకు చెందిన ముగ్గురు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. ఈ ఘటనలో మరో ఇద్దరు ఉగ్రవాదులను అదుపులోకి తీసుకున్నారు. తొలుత కుల్గాం ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. అవి అలా పెరుగుతు పోషియాన్ వరకూ విస్తరించాయి. ఉగ్రవాదలను హతం చేసేందుకు ఆర్మీ, పారామిలిటరీ బలగాలు కొన్ని గంటలుగా కృషి చేసాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. తొలుత కుల్గాం ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. తర్వాత అవి షోపియాన్‌కు విస్తరించాయి. ఆ ఉగ్రవాదులు లష్కరే తోయిబా గ్రూప్‌నకు చెందిన వారిగా తెలుస్తోంది.

# సెల్‌ఫోన్ మట్లాడుతూ పట్టాలు దాటే యత్నం

## రైలు ఢీకొనడంతో ఇద్దరు యువకుల దుర్మరణం

**చెన్నై, మే 13 :** సెల్‌ఫోన్ ,ఏతిలో ఉంటే పరిసరాలను గమనించలేనంతగా మైమరిచిపోతున్నారు. ఈ క్రమంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. తాజాగా సెల్ ఫోన్.. ఇద్దరు విద్యార్థుల ప్రాణాలు తీసింది. ఫోన్ మాట్లాడుతూ పట్టాలు దాటుతున్న ఆ ఇద్దరూ రైలు ఢీకొని మృతి చెందారు. చెన్నైలోని స్థానిక సెయింట్ థామస్ మౌంట్‌లో ఈ ఘటన జరిగింది. పెరంబలూరుకు చెందిన మహమ్మద్ నఫూల్ (20), సబీర్ అహ్మద్ (20)లు థామస్ మౌంట్ సమీపంలోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నారు. థామస్ మౌంట్ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఇద్దరు సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలు దాటుతున్నారు. అదే సమయంలో ఎగ్మూరు నుంచి తాంబరం వైపు వెళ్తున్న సబర్బన్ రైలు దూసుకొచ్చింది. రైలు డ్రైవర్ ఎన్నిసార్లు హారన్ మోగించినా.. స్దానికులు కేకలు వేస్తున్నా యువకులు పట్టించుకోలేదు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ పట్టాలపైకి వచ్చేశారు. ఇద్దరినీ రైలు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. యువకుల మృతదేహాలను స్దానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మహమ్మద్ నఫూల్, సబీర్ అహ్మద్ కలిసి ఆడంబాక్కంలోని ఒక హాస్టల్‌లో ఉన్నారు. ఇద్దరిలో ఒకరు కంప్యూటర్ సైన్స్. మరొకరు ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్నారు. ఆదివారం సాయంత్రం వారిద్దరూ సెయింట్ థామస్ మౌంట్ రైల్వే స్టేషన్ సమీపంలోని మైదానంలో క్రికెట్ ఆడటానికి వెళ్లారు. రాత్రి ఇద్దరు హాస్టల్‌కు తిరిగి రైల్వే ట్రాక్‌పై నడుచుకుంటూ వెళుతుండగా.. ఈ ఘటన జరిగింది.

# నాటు తుపాకీ పేలి ముగ్గురికి గాయాలు

**ఏలూరు, మే 13 :** ఏలూరు జిల్లా కైకలూరు మండలం రామవరంలో నాటు తుపాకీ మందు పేలి ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇంట్లో నాటు తుపాకీలో ఉపయోగించే మందు తయారు చేస్తుండగా సామగ్రి పేలింది. ప్రమాదంలో చరణ్, సతీష్, మణి అనే ముగ్గురు వ్యక్తులకు గాయాలు అయ్యాయి. పక్షులను బెదిరించడానికి నాటు తుపాకీ మందు తయారు చేస్తుండగా ఈ ఘటన జరిగినట్లు- తెలుస్తోంది.

## ఉగ్రవాది అరెస్ట్ వార్త అబద్ధం: సైబర్ సెక్యూరిటీ

**హైదరాబాద్, మే 13 :** శంషాబాద్ విమానాశ్రయంలో ఓ ఉగ్రవాది పట్టుబడినట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని సైబర్‌సెక్యూరిటీ ఖండించింది. ఇది ఫే÷- వార్త అని పేర్కొంది. ఉగ్రవాదిని భద్రతా బలగాలు అదుపులోకి తీసుకుంటున్న వీడియో చక్కర్లు కొడుతోంది. అయితే, దీనిపై తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారులు స్పష్టత ఇచ్చారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది ఫేక్ వీడియో అని ఫ్యాక్ట్ చెక్ ద్వారా నిర్ధరించారు. ఇటీవల శంషాబాద్ ఎయిర్ పోర్టులో మాక్ డ్రిల్ సందర్భంగా తీసిన వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారని తెలిపారు. అధికారులు ధ్రువీకరించని నకిలీ వీడియోలను నమ్మొద్దని విజ్ఞప్తి చేశారు. తప్పుడు వీడియోలు ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

# దరఖాస్తుదారులందరికీ రాజీవ్ యువ వికాసం పథకాన్ని వర్తింపజేయాలి

- సిబిల్ స్కోర్ వెంటనే తీసివేయాలి
- సమాచార హక్కు రక్షణ చట్టం 2005 జిల్లా అధ్యక్షులు శేఖర్



**చౌటుప్పల్, రాజముద్ర న్యూస్ :** దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి రాజీవ్ యువ వికాస పథకాన్ని వర్తింపచేయాలని సామాజిక కార్యకర్త , సమాచార హక్కు రక్షణ చట్టం -2005 యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దబ్బటి శేఖర్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాజీవ్ యువ వికాసం పథకం రేషన్ కార్డు కలిగి ఉన్న నిరుద్యోగులు, రాష్ట్ర ప్రజలు కొన్ని లక్షల మంది ఎన్నో ఆశలతో రాజీవ్ యువ వికాసం దరఖా స్తు చేసుకున్నారని అన్నారు. కానీ వారి ఆశలను అడియాశలను చేస్తూ ఈ మధ్యకాలంలో సిబిల్ స్కోర్ ఉంటేనే లోన్ ఇస్తామని అనడంతో ప్రజలు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని పేద ప్రజలను అర్థం చేసుకోవాలని సిబిల్ స్కోర్ ను వెంటనే తీసివేయాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజీవ్ యువ వికాసం పథకంకు దరఖాస్తు చేసుకున్న వారికి పూర్తిస్థాయిలో సమగ్ర విచారణ చేసి అర్హులైన వారందరికీ లబ్ధిదారులను ఎంపిక చేసి పథకాన్ని వర్తింప చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



## ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసిన డిఎంహెచ్ఓ వెంకటరవణ

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ పట్టణంలో మంగళవారం వికారాబాద్ జిల్లా వైద్యాధికారి వెంకటరవణ హృదయ ఆస్పత్రి, శ్రీ సాయి కంటి ఆసుపత్రిని తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఆస్పత్రులకు పలు కీలక సూచనలు సలహాలు అందించారు. ఆస్పత్రులకు రిజిస్ట్రేషన్ ఉన్నాయా లేవా అని ఆస్పత్రి యాజమాన్యంతో అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రులలో చార్ట్స్ మైంటైన్ చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం అందించిన సలహాలు సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు.

## అందాల పోటీలను రద్దు చేయాలని అడిగినందుకు మహిళా సంఘాల నాయకుల అరెస్టు

ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కార్యదర్శి వై గీత



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** ప్రపంచ సుందరి అందాల పోటీలను రద్దు చేయాలని అడిగినందుకు మహిళా సంఘాల నాయకుల హౌస్ అరెస్టులతో నిర్బంధించడం అప్రజాస్వామికమని ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) రాష్ట్ర కార్యదర్శి వై గీత అన్నారు. ఈ సందర్భంగా ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై గీత ఖండిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల యొక్క అంగంగా ప్రదర్శన ప్రపంచస్థాయి పోటీలను తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించడానికి చేసిన ఏర్పాట్లను ఉపసంహరించుకోవాలని అన్నారు. మహిళల ఆత్మగౌరవాణి కించపరిచే రకంగా ప్రపంచ సుందరి అందాల పోటీలు ఉంటాయని తెలంగాణ రాష్ట్ర సాంస్కృతి సాంప్రదాయాలకు విరుద్ధంగా ఉండేటటువంటి ఈ పోటీలను ఇక్కడ నిర్వహించకూడదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవిస్తూ ఆర్థికంగా దివాల తీస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని నడపడానికే ఇబ్బందిగా ఉందని చెప్తూ, ప్రపంచ సుందరి అందాల పోటీలకు 300 కోట్లు రూపాయలు ఖర్చు చేయడం సరైనది కాదని పేర్కొన్నారు. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్న తరుణంలో పిఓడబ్ల్యు జాతీయ నాయకురాలు సంధ్యతోపాటు ఐద్వా నాయకురాలు మల్లు లక్ష్మి, ఇతర జిల్లాలలో నాయకులను ఇళ్లలోకి చొరబడి అక్రమంగా అరెస్టులు చేయడం తెలంగాణ రాష్ట్రంలో అప్రాజస్వామిక చర్యగా భావిస్తూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని అన్నారు.



## జిహాదీల నరమేధం.. 100 మంది మృతి

**పశ్చిమ ఆఫ్రికా :** పశ్చిమ ఆఫ్రికాకు చెందిన బుర్కినా ఫాసోలో అల్‌ఖైదా అనుబంధ జిహాదీలు నరమేధం సృష్టించారు. ఈ ఘటనలో వంద మందికి పైగా మరణించినట్లు సమాచారం. మృతుల్లో ఎక్కువ మంది సైనికులు, కార్మికులు, స్థానికులు ఉన్నారు. కీలకమైన సైనిక స్థావరం, ఎంతోకాలంగా ముట్టడిలో ఉన్న కీలక పట్టణం డజిబో సహా పలు ప్రాంతాల్లో జిహాదీలు దాడులకు పాల్పడినట్లు ఒక ఎయిడ్ వర్కర్ వెల్లడించారని అంతర్జాతీయ మీడియా పేర్కొన్నాయి. "బుర్కినాఫాసో వైమానిక దళాన్ని చెదరగట్టేందుకు జిహాదీలు ఒకేసారి ఎనిమిది ప్రాంతాల్లో దాడులు చేశాయి. డజిబో ప్రాంతంలో ప్రధానంగా ఆ దాడులు జరిగాయి" అని తెలిపాయి. అల్‌ఖైదా అనుబంధ జేఎన్ఐఎం గ్రూప్.. సాహెల్ ప్రాంతంతో అత్యంత చురుగ్గా కార్యకలాపాలు నిర్వహిస్తోంది. ఆదివారం జరిగిన నరమేధానికి బాధ్యత ప్రకటించుకుంది. 23 మిలియన్ల జనాభా కలిగిన బుర్కినా ఫాసో సైనిక పాలనలో మగ్గుతోంది. సాహెల్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర అనిశ్చితి కారణంగా నిత్యం రగులుతోంది. 2022లో జరిగిన తిరుగుబాట్లతో ఆ దేశంలో సగభాగం కంటే ఎక్కువ ఇతర గ్రూపుల అధీనంలోకి వెళ్లిపోయింది. ఆ దేశ ప్రభుత్వం పైనా తీవ్ర విమర్శలు ఉన్నాయి. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని హత్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది మార్చిలో ఇక్కడి సొలెంజో పట్టణ సమీపంలో ఫులనీ జాతికి చెందిన దాదాపు 100 మంది పౌరులను ప్రభుత్వ బలగాలు, దాని అనుకూల వాలంటీర్లు కాల్చిచంపినట్లు హ్యూమన్ రైట్స్ వాచ్ సంస్థ ఇటీవల వెల్లడించింది. ఇక్కడి ప్రాంతంలో ఫులనీ జాతికి చెందిన ప్రజలే ఎక్కువగా ఉంటారని, ఈ నేపథ్యంలోనే వారిని లక్ష్యంగా చేసుకొని ప్రభుత్వ బలగాలు ఈ దారుణ ఘటనకు పాల్పడినట్లు బాధితులు, సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన వీడియోల ద్వారా తెలుస్తోందని హ్యూమన్ రైట్ వాచ్ వెల్లడించింది. అయితే దీనిని ప్రభుత్వం ఖండించింది. ఇది దుష్ప్రచారమని, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫొటోలు వివిధ వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని పేర్కొంది.

# ఎస్సీ ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంఘం జెండా ఆవిష్కరణ

- ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ మనోహర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి రమేష్





**యాదాద్రి భువనగిరి జిల్లా రాజముద్ర న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్న పేట మండలంలో తెలంగాణా రాష్ట్ర విద్యుత్ ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం చౌటుప్పల్ డివిజన్ అధ్యక్షులు సూర్యనారాయణ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ మహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అదితిలుగా ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్యామ్ మనోహర్, జనరల్ సెక్రటరీ మేడి రమేష్,వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రయ్య, యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఎం ఆర్.రవీందర్ ప్రధాన కార్యదర్శి బొట్ల రాజేశ్వర్ హాజరై జెండా ఆవిష్కరించారు.ముందుగా మండల కేంద్రంలో పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆత్మీయ అతిధి లుగా ఎస్ ఇ సుధీర్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ డా బి ఆర్ అంబేద్కర్ ఆశయా సాధన కోసం పనిచేయాలని, వారిని స్ఫూర్తి గా తీసుకొని ముందుకు వెళ్లాలని కోరారు. ప్రమోషన్లో రిజర్వేషన్ వ్యతిరేకిస్తూ కొన్ని సంఘాలు న్యాయ స్థానాలు వెళ్లి తప్పుడు నివేదికలు సమర్పిస్తూ ప్రమోషన్ ఆపడం జరిగింది. కానీ మా కు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన ప్రమోషన్లను ఎవరు ఎన్ని కుట్రలు చేసినా సాధించి తీరుతామని అన్నారు.అలాగే మా సమస్యలు ఏమైనా ఉన్నా ఇటు ప్రభుత్వంతో యాజమాన్యాల తో మాట్లాడి పరిష్కరిం చేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో డి ఇ వెంకటేశ్వర్లు (భువనగిరి ) మల్లికార్జున్ (చౌటుప్పల్) సబ్ డివిజన్ ఎడిలు బాలు నాయక్, మచ్చేందర్, శ్రీకాంత్,కంపెనీ అధ్యక్షులు ఆనంద్ బాబు,కార్యదర్శి బీచుపల్లి, 1104 జిల్లా అధ్యక్షులు యాదగిరి, 327 జిల్లా అధ్యక్షులు మహేష్,బీసీ ఉద్యోగుల సంఘము అధ్యక్షులు మురళి,భువనగిరి డివిజన్ కార్యదర్శి శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ దుర్గయ్య, మహిళా ప్రతినిధి స్వరూప, వివిధ మండల ఏఇలు తదితరులు పాల్గొన్నారు.

# పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం

- కూలీల ట్రాలీని ఢీకొన్న లారీ.. ఐదుగురు దుర్మరణం
- ఘటనపై మంత్రి లోకేశ్ తీవ్ర దిగ్భ్రాంతి



**గుంటూరు, మే 13 :** పల్నాడు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం ఉదయం వినుకొండ మండలం శివాపురం వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న బొలెరో ట్రాలీ.. లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మరో ఇద్దరు చనిపోయారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నుంచి వ్యవసాయ కూలీలను వినుకొండకు తీసుకొస్తుండగా ప్రమాదం జరిగింది. మృతులంతా ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీదపల్లికి చెందిన వ్యవసాయ కూలీలుగా పోలీసులు గుర్తించారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన గ్రామస్తులు, స్థానికులను తీవ్ర ఆవేదనకు గురిచేసింది. ఈ ప్రమాదం మంగళవారం ఉదయం జరిగింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి సహాయక చర్యలు చేపట్టారు. మృతులంతా ఒకే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆ గ్రామంలో తీవ్ర విషాద చాయలు అలుముకున్నాయి. కూలీల కుటుంబాలు కడు పేదరికంతో బాధపడుతున్నాయి. రెక్కాడితే డొక్కాడని పరిస్థితి వారిది. కుటుంబ సభ్యులు మృతిచెందడంతో ఆయా కుటుంబాలు తీవ్రశోకంలో మునిగిపోయాయి. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ రోడ్డు ప్రమాదంపై మంత్రి నారా లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాల అండగా నిలుస్తుందని లోకేశ్ హామీ ఇచ్చారు..

# ఉద్రిక్తతల వేళ.. ఊపందుకున్న 'బాయ్‌కాట్ తుర్కియే' నినాదం




**పుణె :** పాకిస్థాన్‌లోని ఉగ్రవాదులు, వారి స్థావరాలను అంతం చేయడమే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్ ను భారత్ చేపట్టగా.. ఆ సమయంలో పాకిస్థాన్‌కు తుర్కియే అనుకూలంగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. దీంతో ఎర్డోగాన్ ప్రభుత్వం తీరుపై మనదేశంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. 'బాయ్‌కాట్ తుర్కియే' పేరుతో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగింది. తాజాగా 'బ్యాన్ తుర్కియే' అంటూ పలువురు వ్యాపారులు కూడా ఆ దేశం నుంచి దిగుమతి అయ్యే వస్తువులను విక్రయించేందుకు నిరాకరిస్తున్నారు. పాక్‌తో ఉద్రిక్త పరిస్థితుల వేళ దేశంలో బాయ్‌కాట్ తుర్కియే నినాదం ఊపందుకుంది. ఈ క్రమంలో తాజాగా పుణెలోని వ్యాపారులు కూడా ఆ దేశం యాపిల్‌లను బహిష్కరిస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. దీంతో స్థానిక మార్కెట్‌లో అవి కనిపించకుండా పోతున్నాయి. స్థానికులు కూడా ఇతర ప్రదేశాల నుంచి దిగుమతయ్యే పండ్లను తీసుకుంటున్నారు.

**ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి..**

పుణెలో మార్కెట్‌లో తుర్కియే యాపిల్‌ల సీజన్ టర్నోవర్ రూ.1000 నుంచి 1200 కోట్ల వరకు ఉంటుందని అంచనా. దీంతో వ్యాపారుల తాజా నిర్ణయం పండ్ల మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నట్లు తెలుస్తోంది. అయినప్పటికీ వర్తకులు మాత్రం.. దీన్ని ఆర్థిక నిర్ణయంగా మాత్రమే కాదని, ప్రభుత్వానికి, సాయుధ బలగాలకు సంఘీభావంగా చూస్తున్నామని పేర్కొంటున్నారు. యాపిల్‌లను అక్కడ నుంచి దిగుమతి చేసుకునే బదులు హిమాచల్, ఉత్తరాఖండ్, ఇరాన్, ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్నారు. మరోవైపు, హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన కాంగ్రెస్ నేత కుల్‌దీప్ సింగ్ రాథోడ్ కూడా తుర్కియే తీరుపై ఇటీవల తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. 2023లో భీకర భూకంప సమయంలో 'ఆపరేషన్ దోస్త్' ద్వారా భారత్ ఆ దేశానికి ఎంతో సాయం చేసిందని, అయినప్పటికీ ఆ దేశం దౌత్య ద్రోహానికి పాల్పడిందని ఆరోపించారు. ఈ సందర్భంగా అక్కడి దిగుమతులపై నిషేధం విధించాలని డిమాండ్ చేశారు.

**భారత్‌పై ద్వేషం..** ఇదిలాఉంటే, ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్‌కు సైనిక విమానాలు, యుద్ధనౌకను తుర్కియే పంపించినట్లు వార్తలు వచ్చాయి. ఆ ఆయుధాలనే భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తోందని సమాచారం.

# పాత ఫొటోలు చూపి.. కొత్త కథలు చెప్పిన పాక్ నేవీ..



**న్యూఢిల్లీ :** పాకిస్థాన్ ప్రభుత్వ యంత్రాంగం ఓ ఫేక్‌న్యూస్ ఫ్యాక్టరీని తలపిస్తోంది. ఆపరేషన్ సిందూర్ మొదలైన నాటినుంచి ఆ దేశ మిలిటరీ, ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు, మీడియా సంస్థలు తప్పుడు వార్తలు, చిత్రాలను విస్తృతంగా ప్రచారంలోకి తీసుకొస్తున్నాయి. వీటిని భారత్ సంస్థలు సమర్థంగా తిప్పికొడుతున్నాయి. తాజాగా పాక్ నేవీ తాము ఓ పెద్ద వార్ మిషన్ అన్నట్లు చూపే ఓ ఫొటోను షేర్ చేసింది. పాక్‌కు చెందిన డీజీ ఐఎస్‌పీఆర్ ప్రెస్‌మీట్‌లో ఆ దేశ నేవీ అధికారి ఓ ప్రెజెంటేషన్ ఇస్తూ.. భారత్ నౌకాదళాన్ని కట్టడి చేయడానికి సబ్‌మెరైన్లతో సహా తాము చాలా వేగంగా మోహరింపులు జరిపామంటూ ఓ ఫొటోను ప్రదర్శించారు. దీనిలో మూడు యుద్ధ నౌకలు వాటిపై ఎగురుతున్న మూడు నిఘా విమానాలతో చాలా గంభీరంగా ఉంది. తీరా ఈ ఫొటో ఎక్కడిదా.. అని మిలిటరీ విశ్లేషకులు పరిశీలించగా.. అది 2023 నాటిదని తేలింది. చైనా-పాక్ సంయుక్త నౌకాదళ విన్యాసాల సందర్భంగా హిందూ మహాసముద్రంలో తీసిందిగా తేల్చారు. బీజింగ్-ఇస్లామాబాద్‌కు చెందిన యుద్ధ నౌకలు పెట్రోలింగ్ ఫార్మేషన్‌గా ఏర్పడినవి. వాటిపైన ఎగురుతున్న లాక్ హీడ్‌మా ర్టిన్ సంస్థ తయారుచేసి పీ-3సీ ఓరియన్ విమానాలు. ఇక ఈ ఫొటోలో ఒకటి తగ్గిందని భావించిందో ఏమో.. పాక్ డిజిటల్ ఇంజినీర్లు ఓ సబ్‌మెరైన్ చిత్రాన్ని కూడా దీనిలో చేర్చారు. దీని ఒరిజినల్ చిత్రాన్ని ది యూరేషియన్ టైమ్స్ 2023లో ప్రచురించింది. దానిని తీసుకొచ్చి.. తమ మోహరింపులు అంటూ పాక్ డీజీఐఎస్‌పీఆర్ బ్రీఫింగ్స్‌లో ప్రదర్శించడం గమనార్హం.

**భారత్ ఎస్-400 పేల్చేశామంటూ.. తప్పుడు చిత్రాలు..!**

ఆదంపూర్ బేస్‌లోని ఎస్-400ను పేల్చేశామంటూ పాక్ అనుకూల సంస్థలు చిత్రాన్ని ప్రచారంలోకి తెచ్చాయి. కానీ, ఉపగ్రహ చిత్ర విశ్లేషకుడు డామియన్ సైమన్ మాత్రం ఈ ప్రచారాన్ని కొట్టిపారేశారు. అసలు ఎటువంటి నష్టం జరగలేదని పేర్కొన్నారు. ఈవిషయాన్ని తన ఎక్స్ ఖాతాలో పోస్టు చేశారు. అలాగే చైనాకు చెందిన ఓ సంస్థ ఆదంపూర్ బేస్‌లో ఓ భవనం దెబ్బతిన్నట్లు ఫొటోను ప్రచారంలోకి తెచ్చింది. కానీ, దీనిని కూడా డామియన్ సైమన్ పాత ఫొటోలతో సరిచూసి.. అసలు ఆ భవనం చాన్నాళ్ల క్రితమే కూలిపోయిందని పాత ఇమేజీని బయటకు తీసుకొచ్చారు. జైపూర్, ఉధంపూర్ ఎయిర్ బేస్‌లపై కూడా ఇలానే మార్ఫింగ్ చేసిన చిత్రాలను పాక్ అనుకూల మీడియా ప్రచారంలోకి తెస్తోంది.

# హత్యా కేసులో ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు

వికారాబాద్ జిల్లా ఎస్పీ కె.నారాయణ రెడ్డి



**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** హత్య కేసులో ముగ్గరి నిందితులకు జీవిత ఖైదు శిక్ష కోర్టు విధించడం జరిగిందని వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఎస్పీ కే నారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... 2014 డిసెంబరు 5న కోట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన హత్యా కేసులో ముగ్గరు నిందితులకు జీవిత ఖైదు శిక్ష విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి డా. సున్నం శ్రీనివాస్ రెడ్డి మంగళవారం తీర్పు ఇచ్చినట్లు తెలిపారు. ఇందోల్ గ్రామానికి చెందిన బాసుపల్లి పెంటప్పా (ఫిర్యాదుదారుడు), తన తమ్ముడు బాసుపల్లి హన్మంతు (మృతుడు)కు తమ పాళివారైన బాసుపల్లి అంజిలప్ప కుటుంబంతో తరచూ ఘర్షణలు జరిగేవి. 2014 డిసెంబరు 4వ తేదీ రాత్రి 7 గంటల సమయంలో హన్మంతు తన ఇంటికి వెళ్లే క్రమంలో బాసుపల్లి అంజిలప్ప పాత గొడవలు మనసులో పెట్టుకొని గొడవకు దిగాడు. ఆ సమయంలో అంజిలప్ప కుమారులు ఏ1 శ్రీనివాస్, ఏ2 పాండు అక్కడికి వచ్చి హన్మంతును దాడి చేయగా పాండు పట్టుకొని శ్రీనివాస్ కట్టెతో తలపై అంజిలప్ప రాయితో తలపై దెబ్బతీసిన ఫలితంగా హన్మంతు అక్కడికక్కడే మృతి చెందాడు అని ఫిర్యాదు రావడం జరిగిందన్నారు. ఈ ఘటనపై అప్పటి ఎస్ఐ ఆర్. రమేష్ క్రైం నం.150/2014గా ఐపీసీ సెక్షన్లు 148, 302, 326, 324, 201, 109 ప్రకారం కేసు నమోదు చేశారు. అప్పటి కరణ్‌కోట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శివ శంకర్ దర్యాప్తు నిర్వహించి, కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారని అన్నారు. వాదోపవాదనలు విన్న న్యాయమూర్తి మంగళవారం నిందితులకు జీవిత ఖైదు, జరిమానా శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని తెలిపారు. ఈ కేసులో న్యాయసేవ అందించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు నారాయణ గౌడ్, వి. రవి కుమార్, సుధాకర్ రెడ్డి లు, దర్యాప్తు నిర్వహించిన అప్పటి ఎస్ ఐ ఆర్. రమేష్, ఇన్‌స్పెక్టర్ శివ శంకర్, ప్రస్తుత ధరూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్. రఘు రాములు, ఎస్ ఐ ఎం.ఏ. గఫ్ఫార్, సీడీఓ లు మహేశ్వర్ రెడ్డి, బ్రీఫింగ్ అధికారి బి. వీరన్నలు సమిష్టిగా కృషి చేయడం జరిగింది అన్నరు. ఈ కేసులో శిక్ష పడేలా కృషి చేసిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కె. నారాయణ రెడ్డి అభినందించరు.



## సాధన మానసిక వికలాంగుల సంస్థలో అన్నదానం

**వలిగొండ రాజముద్ర న్యూస్:** వలిగొండ మండల పరిధిలోని రెడ్లరేపాక గ్రామానికి చెందిన కందుల నరేష్ సరోజ దంపతుల కుమారుడు కందుల హర్షవర్ధన్ (6) గత సంవత్సర క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందగా మంగళవారం జరిగిన మొదటి వర్ధంతి (జన్మదినం) సందర్భంగా టేకుల సోమరంలోని సాధన మానసిక వికలాంగుల సంస్థలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేసి పండ్లు పంపిణీ చేశారు.అనంతరం రెడ్లరేపాక గ్రామంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కందుల శ్రీను,కందుల మహేష్,గాడిపల్లి రమేష్,కందుల రమేష్,కందుల శేఖర్,కందుల ప్రవీణ్,కందుల భాస్కర్,కందుల మహేందర్, తదితరులు పాల్గొన్నారు.



## కోల్‌కతా ఎయిర్‌పోర్టులో హైఅలర్ట్

**కోల్‌కతా:** భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్న వేళ కోల్‌కతాలోని 'ది నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయానికి' బాంబు బెదిరింపు ఫోన్ కాల్ వచ్చింది. దీంతో పరిసర ప్రాంతాల్లో హై అలర్ట్ ప్రకటించారు. కోల్‌కతా నుంచి ముంబయి వెళ్తున్న ఇండిగో విమానంలో బాంబు అమర్చినట్లు గుర్తు తెలియని వ్యక్తి విమానాశ్రయ అధికారులకు ఫోన్ చేసి చెప్పాడు. అక్కడికి కొద్ది నిమిషాల్లోనే ఆ విమానం టేకాఫ్ కావాల్సి ఉంది. అప్రమత్తమైన అధికారులు వెంటనే అందులోని ప్రయాణికులు, లగేజీని కిందికి దింపేశారు. విమానాన్ని 'ఐసోలేషన్ బే'లోకి తీసుకెళ్లి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పద వస్తువులేవీ కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కోల్‌కతా విమానాశ్రయం నుంచి ఇండిగో విమానం మధ్యాహ్నం 1.30 గంటలకు బయల్దేరి.. సాయంత్రం 4.20 గంటలకు ముంబయి చేరాల్సి ఉంది. మొత్తం 195 మంది చెక్‌ఇన్ అయిన తర్వాత బాంబు బెదిరింపు ఫోన్ కాల్ రావడంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. అత్యవసర ప్రకటన చేసి.. ఎయిర్‌పోర్టు పరిసరాల్లో హై అలర్ట్ ప్రకటించారు. బాంబు నిర్వీర్య బృందాలు, ఇతర రక్షణ బృందాలు ఎయిర్‌పోర్టులో అణువణువూ గాలించారు. విమానాశ్రయం వద్ద సీఐఎస్ఎఫ్ బలగాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. పహల్గాం ఉగ్రదాడికి ప్రతిచర్యగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టిన తర్వాత ఇలా బాంబు బెదిరింపులు రావడం ఇది రెండోసారి. ఛండీగఢ్ నుంచి ముంబయి వస్తున్న ఇండిగో విమానంలో బాంబు అమర్చినట్లు మే 6న ముంబయి విమానాశ్రయ అధికారులకు ఓ దుండగుడు ఫోన్ చేసి బెదిరించాడు. ఆ తర్వాత అది బూటకమని తేలింది.



# అండమాన్‌ను తాకిన నైరుతి రుతుపవనాలు

**న్యూఢిల్లీ :** గ్రీష్మంతో మాడుతున్న దేశానికి చల్లని కబరు వచ్చేసింది. దేశానికి అత్యధికంగా వర్షపాతానిచ్చే నైరుతి రుతుపవనాలు మరింత చురుగ్గా కదులుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నాటికి అవి దక్షిణ అండమాన్ సముద్రం, నికోబార్ దీవులు, దక్షిణ బంగాళాఖాతానికి చేరినట్లు భారత వాతావరణ విభాగం వెల్లడించింది. రుతుపవనాల ఆగమనం దృష్ట్యా గత రెండు రోజులుగా నికోబార్ దీవుల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయని పేర్కొంది. రానున్న మూడు, నాలుగు రోజుల్లో అండమాన్ నికోబార్ దీవులంతటితో పాటు దక్షిణ అరేబియా సముద్రం, బంగాళాఖాతం మధ్య వరకు విస్తరించేందుకు వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని ఐఎండీ వెల్లడించింది. మే 27 నాటికి ఈ రుతుపవనాలు కేరళను తాకే అవకాశం ఉన్నట్లు ఇప్పటికే వాతావరణ శాఖ అంచనా వేసిన సంగతి తెలిసిందే. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు పలకరిస్తుంటాయి. ఈ సారి మాత్రం అంతకంటే ముందుగానే వచ్చేందుకు అవకాశాలు కన్పిస్తున్నాయి. అలా జరిగితే 2009 తర్వాత రుతుపవనాలు అంచనాల కంటే ముందుగా రావడం మళ్లీ ఇప్పుడే అవుతుంది. ఆ ఏడాది మే 23నే నైరుతి రుతుపవనాలు కేరళను తాకాయి. ఈ సారి సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మన దేశంలో 52% నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశ మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో ఈ సాగు భూమి నుంచి ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీ తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యం.



# పొల్లాచి లైంగిక వేధింపుల కేసు..

## 9 మందిని దోషులుగా తేల్చిన కోర్టు

**తమిళనాడు :** తమిళనాడులోని పొల్లాచిలో 2019లో వెలుగు చూసిన లైంగిక వేధింపుల కేసు సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ కేసులో నిందితులుగా ఉన్న తొమ్మిది మందిని కోయబంత్తూర్‌లోని సెషన్స్ కోర్టు దోషులుగా తేల్చింది. నిందితులు తొమ్మిది మంది 2019 నుంచి జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. వారిని మంగళవారం కట్టుదిట్టమైన భద్రతతో సెషన్స్ కోర్టుకు తీసుకొచ్చారు. ఈ కేసు విచారణలో భాగంగా న్యాయస్థానం వీరందరినీ దోషులుగా తేల్చింది. మధ్యాహ్నం వీరికి శిక్షను ఖరారు చేయనుంది. అయితే, దోషులకు జీవిత ఖైదు విధించాలని బాధితుల తరఫు న్యాయవాదులు న్యాయస్థానాన్ని కోరారు. 2016-2018 మధ్య కాలంలో ఒక కళాశాల విద్యార్థినితో సహా పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసు ఇది. నిందితులు మహిళలను లైంగికంగా వేధించడమే కాకుండా వాటిని మొబైల్ ఫోన్‌లలో చిత్రీకరించారు. వాటిని ఉపయోగించి మహిళలను డబ్బు కోసం బ్లాక్ మెయిల్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులో మొత్తం 9 మందిని పోలీసులు అరెస్టు చేశారు. తొలుత ఈ కేసును పొల్లాచి పోలీసులు విచారణ చేశారు. అనంతరం తమిళనాడు క్రైమ్ బ్రాంచ్- క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ కు బదిలీ చేశారు. ఆ తర్వాత సీబీఐకి బదిలీ చేశారు. ఈ కేసు అప్పట్లో తమిళనాడులో పెద్దఎత్తున సంచలనం సృష్టించింది. రాజకీయంగానూ తీవ్ర దుమారం రేపింది. ఈ కేసు దర్యాప్తు సమయంలో బాధితుల తరఫున 200కు పైగా పత్రాలను, 400 ఎలక్ట్రానిక్ పరికరాలను ఆధారాలుగా చూపించారు.



# అమెరికా వస్తువులపై భారత్ టారిఫ్‌లు..!

**న్యూఢిల్లీ :** అమెరికాకు చెందిన కొన్ని రకాల వస్తువులపై ప్రతీకార సుంకాలు విధించనున్నామన్న విషయాన్ని భారత్ ప్రపంచ వ్యాణిజ్యసంస్థకు వెల్లడించింది. ముఖ్యంగా భారత స్టీల్, అల్యూమినియంపై విధించిన సుంకాలకు ప్రతిస్పందనగా ఈ నిర్ణయం తీసుకొన్నట్లు తెలుస్తోంది. కొన్ని ప్రత్యేకమైన అమెరికా వస్తువులకు ఇస్తున్న రాయితీలను నిలిపివేసి.. దిగుమతి సుంకాలను పెంచనున్నట్లు దీనిలో వెల్లడించింది. అమెరికా విధించిన టారిఫ్‌ల కారణంగా.. 7.6 బిలియన్ డాలర్ల విలువైన భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావం పడనుంది. అగ్రరాజ్యం రక్షణాత్మక వైఖరిని అవలంభిస్తోందని భారత్ తప్పుపట్టిన విషయం తెలిసిందే. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై భారీఎత్తున టారిఫ్‌లు విధించారు. క్రూడ్ స్టీల్ తయారీలో ప్రపంచంలోనే భారత్ రెండో స్థానంలో ఉంది. ఈ రంగంపై ట్రంప్ టారిఫ్‌ల ప్రభావం పడనుంది. ఈనేపథ్యంలో భారత్ ప్రపంచ వాణిజ్యసంస్థ వద్ద ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించడంతో ఇరుదేశాల మధ్య వాణిజ్య ఘర్షణ పెరుగుతోందనడానికి సంకేతంగా నిలిచింది. సరికొత్త వాణిజ్య ఒప్పందానికి న్యూదిల్లీ - వాషింగ్టన్ అత్యంత సమీపంలోకి వచ్చినట్లు వార్తలొస్తున్న వేళ ఈ పరిణామాలు చోటుచేసుకోవడం గమనార్హం. అమెరికాకు వాణిజ్యలోటును తగ్గించేందుకు భారత్ చాలా రాయితీలను ఈ డీల్ ద్వారా ఆఫర్ చేసినట్లు ప్రచారం జరిగింది.

# జమ్మూకశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

## ముగ్గురు ఉగ్రవాదులు హతం



**జమ్మూకశ్మీర్ :** జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. షోపియాన్ ప్రాంతంలో జిన్‌పాథర్ కెల్లర్‌లో చోటుచేసుకున్న కాల్పుల్లో వారిని మట్టుపెట్టారు. నిఘా సమాచారం మేరకు తొలుత కుల్గాం ప్రాంతంలో భద్రతా బలగాలు, ఉగ్రవాదులకు మధ్య కాల్పులు ప్రారంభమయ్యాయి. తర్వాత అవి షోపియాన్‌కు విస్తరించాయి. ఉగ్రమూకలను మట్టుపెట్టేందుకు ఆర్మీ, పారామిలిటరీ బలగాలు కొన్ని గంటలపాటు ఈ ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్నాయి. దీని కి 'ఆపరేషన్ కెల్లర్' అని పేరు పెట్టారు. హతుల్లో ఇద్దరిని భద్రతా బలగాలు గుర్తించాయి. ఒకడి పేరు షాహిద్ కుట్టాయ్. 2023లో లష్కరే తయ్యిబాలో చేరాడు. హీరాపుర ప్రాంతంలో స్థానిక భాజపా నేత హత్యలో అతడి ప్రమేయం ఉంది. మరొక ఉగ్రవాదిని అద్నాన్ షఫీ దార్‌గా గుర్తించారు. అతడు 2024లో లష్కరేలో చేరాడు. 2024, అక్టోబర్‌లో వాచి అనే ప్రాంతంలో స్థానికేతర కార్మికుడి హత్యకు పాల్పడ్డాడని భద్రతా వర్గాలు వెల్లడించాయి. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడికి కారకులుగా భావిస్తోన్న ముగ్గురు పాకిస్థానీ ఉగ్రవాదుల ఫొటోలతో కూడిన పోస్టర్లను జమ్మూకశ్మీర్‌లో భద్రతా సిబ్బంది ఏర్పాటు చేశారు. వాటిపైన టెర్రర్ ఫ్రీ కశ్మీర్ అని సందేశం దర్శనమిచ్చింది. ఆ ఉగ్రమూకల గురించి ఎవరైనా విశ్వసనీయ సమాచారం ఇస్తే.. రూ.20 లక్షల రివార్డు ఇస్తామని వాటిల్లో పేర్కొన్నారు. ఈ సమాచారం గురించి చెప్పిన వారి వివరాలు ఎట్టి పరిస్థితుల్లో బయటకురాదని భరోసా ఇచ్చారు. పహల్గాంలో ఏప్రిల్ 22న పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన పాశవిక దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. పర్యాటకుల తలపైనే గురిపెట్టి కాల్చారు. మొత్తం 10 నిమిషాల్లో 26 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఈ ఘటనతో భారత్, పాక్‌ల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. దీనికి లష్కరే తోయిబా అనుబంధ సంస్థ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' ఈ దాడికి పాల్పడింది. దీనికి కర్త, కర్మ, క్రియ మాత్రం లష్కరే తోయిబా చీఫ్, భారత మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాది హాఫీజ్ సయీద్ అని నిఘా వర్గాలు అనుమానిస్తున్నాయి.

# ట్రంప్ పశ్చిమాసియా పర్యటన మొదలు..



**యూఎస్ :** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పశ్చిమాసియా పర్యటనలో భాగంగా నేడు సౌదీ అరేబియాకు చేరుకొన్నారు. ఆయనకు యువరాజు మహమ్మద్ బిన్ సల్మాన్ స్వాగతం పలికారు. ట్రంప్ రెండో సారి అధికారం చేపట్టిన తర్వాత చేపట్టిన తొలి పెద్ద పర్యటన ఇదే. దీనిలో భాగంగా ఆయన సౌదీ, యూఏఈ, ఖతార్‌ను సందర్శించనున్నారు. నేటి ఉదయం ఆయన విమానం రియాద్‌కు చేరుకొంది. ట్రంప్ వెంట అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వాణిజ్య మంత్రి హొవర్డ్ లుట్నిక్, ఇంధనశాఖ మంత్రి క్రిస్ రైట్ ఉన్నారు. పశ్చిమాసియా పర్యటన నాలుగు రోజుల పాటు జరగనుంది. నేడు ట్రంప్ కోసం ఏర్పాటు చేసిన విందులో పలు కంపెనీల సీఈవోలు పాల్గొననున్నారు. వీటిల్లో అమెజాన్, ఎన్విడియా,ఓపెన్ ఏఐ,ఉబర్, కోకాకోలా, గూగుల్, బోయింగ్ సీఈవోలు ఉంటన్నారు. దీనికి టెస్లా సారథి మస్క్ కూడా హాజరుకానున్నారు. తాను తుర్కియేకు కూడా వెళ్లే అవ కాశం ఉన్నట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఈ నెల 15 నుంచి ఉక్రెయిన్, రష్యా మధ్య చర్చలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పుతిన్, జెలెన్‌స్కీతో నేరుగా చర్చించే అవకాశాలున్నాయి.

**విమానం తాత్కాలికంగా బదిలీనే..**

తనకు ఖతార్ రాజకుటుంబం అత్యంత విలువైన బోయింగ్ 737 విమానం గిఫ్ట్‌గా ఇవ్వనుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నారు. మరోవైపు ఆ బహుమతి తీసుకోవడం అనైతికం.. అన్న అంశాన్ని ఆయన కొట్టిపారేశారు. దాదాపు 400 మిలియన్ డాలర్ల విలువైన విలాసవంతమైన విమానాన్ని కానుకగా అందించనున్నట్లు ప్రచారం మొదలైంది. దీనిని ఎయిర్ ఫోర్స్‌వన్ కింద వాడుకోవాలని ట్రంప్ ఆలోచిస్తున్నారు. ఇప్పటి వరకు అమెరికా అధ్యక్షులకు అందిన అత్యంత విలువైన బహుమతి ఇదే కావొచ్చు. దీనిని స్వీకరించడంపై వచ్చిన విమర్శలను తోసిపుచ్చారు. "అంత ఉదారంగా ఖతర్ రాజకుటుంబం ఇచ్చే బహుమతిని వద్దనడానికి నేను మూరుడిని కాదు" అని పశ్చిమాసియా పర్యటనకు వెళ్లే ముందు వ్యాఖ్యానించారు. చివర్లో దీనిని ప్రెసిడెన్షియల్ లైబ్రరీకి ఇచ్చేస్తానన్నారు. వ్యక్తిగత అవసరాలకు వాడుకొనే ఉద్దేశం లేదని తేల్చిచెప్పారు. మరోవైపు ఖతార్ ప్రతినిధి మాత్రం తాము విమానం ఇస్తున్నట్లు జరుగుతున్న ప్రచారం సరికాదన్నారు. తాత్కాలికంగా ఓ విమానాన్ని బదిలీ చేసే అంశం మాత్రమే చర్చల్లో ఉందని వెల్లడించారు.


# మా సైనికులు 11 మంది చనిపోయారు : పాక్



**పాకిస్థాన్ :** భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో తనకు జరిగిన నష్టాలను పాక్ మెల్లగా వెల్లడిస్తోంది. తాజాగా 11 మంది సైనికులు మరణించగా.. మరో 78 మంది తీవ్రంగా గాయపడ్డారని తెలియజేసింది. ఇక పాకిస్థాన్ వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది మృతి చెందారని.. వీరిలో స్క్వాడ్రన్ లీడర్ ఉస్మాన్ యూసఫ్ కూడా ఉన్నట్లు తెలిపింది. భారత్ చేపట్టిన ఆపరేషన్‌లో 40 మంది పౌరులు చనిపోగా.. 121 మంది గాయపడినట్లు పేర్కొంది. ఈమేరకు ఆ దేశ సైన్యానికి చెందిన డీజీ ఐఎస్‌పీఆర్ ఓ ప్రకటనలో వెల్లడించింది. నిన్న కూడా పాక్ ఆర్మీ అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ జనరల్ అహ్మద్ షరీఫ్ చౌధరీ.. తమ దేశ ఎయిర్‌ఫోర్స్, నేవీ అధికారులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. "భారత్‌తో జరిగిన సైనిక ఘర్షణల్లో మన వాయుసేనకు చెందిన ఓ యుద్ధ విమానం స్వల్పంగా ధ్వంసమైంది" అని వెల్లడించారు. అయితే, ఆ నష్టం ఏ స్థాయిలో ఉందనే విషయంపై పూర్తి వివరాలను ఆయన బయటపెట్టలేదు. మరోవైపు భారత వాయుసేనకు చెందిన ఎయిర్ మార్షల్ ఏకే భారతి ఇటీవల మీడియా బ్రీఫింగ్స్‌లో మాట్లాడుతూ తాము పాక్ యుద్ధ విమానాలను కూల్చేసినట్లు ధ్రువీకరించారు. అయితే.. ఆ శకలాలు పాకిస్థాన్‌లోనే పడిపోయినట్లు చెప్పారు. కూలిపోయిన విమానం పాక్‌కు చెందిన మిరాజ్ కావచ్చని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు.

# గురు గ్రహ ధ్రువాల వద్ద.. వందల రెట్ల కాంతి

**వాషింగ్టన్:** అంతరిక్షం నుంచి వచ్చే అధిక విద్యుదావేశం గల కణాలు భూ ధ్రువాలపైనున్న వాతావరణంలోని వాయు కణాలతో ఢీకొన్నప్పుడు ఆకాశంలో అందమైన జ్యోతులు నర్తిస్తూ కనిపిస్తాయి. వీటిని ఉత్తర, దక్షిణ ధ్రువ జ్యోతులని అంటారు. భూమికన్నా ఎన్నో రెట్లు పెద్దదైన గురు గ్రహ ధ్రువాల వద్ద వందల రెట్లు ఎక్కువ కాంతితో వెలుగులు నర్తిస్తున్నాయని జేమ్స్ వెబ్ అంతరిక్ష టెలిస్కోప్ కనిపెట్టింది. 2023 క్రిస్మస్ నాడు ఈ టెలిస్కోప్ తీసిన గురు జ్యోతుల ఫొటోలను శాస్త్రజ్ఞులు పరిశీలించారు. గతంలో వాయేజర్ 2 అంతరిక్ష నౌక నెప్ట్యూన్ గ్రహం ధ్రువాల వద్ద కూడా ఒక మోస్తరు కాంతులను కనిపెట్టింది.




# అమెరికాలో రోడ్డు ప్రమాదం..

## ఇద్దరు భారతీయ విద్యార్థుల మృతి

**న్యూయార్క్:** ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన ఇద్దరు భారతీయ విద్యార్థులు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. వారు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను 23 ఏళ్ల సౌరవ్ ప్రభాకర్, 20 ఏళ్ల మానవ్ పటేల్‌గా గుర్తించారు. అమెరికా కాలమానం ప్రకారం శనివారం ఉదయం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరిద్దరూ ఒహాయోలోని క్లీవ్‌ల్యాండ్ స్టేట్ యూనివర్సిటీలో చదువుతున్నారు. మే 10న పెన్సిల్వేనియాలోని లాంకస్టరన్ కౌంటీలో వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పింది. రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టి వంతెన మధ్యలో ఇరుక్కుపోయింది. ప్రమాద సమయంలో సౌరవ్ ప్రభాకర్ వాహనాన్ని నడుపుతుండగా.. మానవ్, మరో వ్యక్తి కారులో ఉన్నారు. ఈ ప్రమాదంలో సౌరవ్, మానవ్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో ప్రయాణికుడికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు. ఘటనపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ జనరల్ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. మృతుల కుటుంబాలకు సంతాపం ప్రకటించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మృతుల కుటుంబాలకు అన్నివిధాలుగా అండగా ఉంటామని, మృతదేహాలను స్వదేశానికి పంపించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దౌత్య కార్యాలయం వెల్లడించింది.

# బాంబు పేలుళ్లపై ముంబయి పోలీసులకు మెయిల్



**ముంబయి :** రానున్న రెండు రోజుల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయని కొందరు అగంతకులు బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ మేరకు ముంబయి పోలీసులకు ఇ-మెయిల్ పంపించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు మంగళవారం ఒక ఇ-మెయిల్ వచ్చింది. అందులో రానున్న రెండు రోజుల్లో బాంబు పేలుళ్లు జరుగుతాయని నిందితులు హెచ్చరించారు. దీంతో అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. ఈ మెయిల్‌ను ఎవరు పంపించారనే విషయంపై దర్యాప్తు చేస్తున్నారు. అంతే కాకుండా భద్రతాపరమైన చర్యలు చేపట్టారు. ఇటీవల భారత్- పాక్‌ల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో అనేక ప్రాంతాలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. అయితే, అవన్నీ బూటకమని అధికారులు తేల్చారు. ప్రస్తుతం భారత్- పాక్‌ల మధ్య కాల్పుల విరమణ కొనసాగుతోంది. ఈక్రమంలో బాంబు బెదిరింపులు రావడం కలకలం సృష్టిస్తోంది.




# పాక్‌పై ఇక ద్వైపాక్షిక ఒత్తిడి..

## నేడు పలు దేశాలకు భారత్ స్పెషల్ బ్రీఫింగ్..

**న్యూఢిల్లీ :** ఉగ్ర ముఠాలకు అండగా ఉంటూ సీమాంతర ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు భారత్ గట్టిగా బుద్ధి చెప్పింది. 'ఆపరేషన్ సిందూర్'తో శత్రుదేశాన్ని అన్నివిధాలుగా దెబ్బతీసిన న్యూదిల్లీ.. ఇప్పుడు దాయాదిపై ద్వైపాక్షికంగా ఒత్తిడి తెచ్చేందుకు సిద్ధమైంది. ఈ క్రమంలోనే నేడు పలు దేశాల సైనిక రాయబారులకు కేంద్రం ప్రత్యేక బ్రీఫింగ్ ఇవ్వనుంది. మన దేశంలో ఉన్న యూకే సహా పలు దేశాల డిఫెన్స్ అధికారులు, రాయబారులకు కేంద్రం ఇప్పటికే సమన్లు పంపించింది. మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు దిల్లీలోని రక్షణశాఖ కార్యాలయంలో కీలక భేటీ నిర్వహించనుంది. ఇందులో 'ఆపరేషన్ సిందూర్'కు సంబంధించిన ముఖ్య వివరాలను ఆయా దేశాల ప్రతినిధులతో పంచుకోనుంది. ఉగ్రవాద నిర్మూలనలో భారత్ వేసిన ముందడుగు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాల వివరాలను వారికి అందించనున్నట్లు సమాచారం. పాక్‌పై మిలిటరీ చర్యకు కారణాలు చెప్పి.. మద్దతు కొనసాగించాలని ఆ దేశాలను కేంద్రం కోరనున్నట్లు తెలుస్తోంది. నేటి మధ్యాహ్నం జరిగే భేటీలో విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, పలువురు ఉన్నతాధికారులు, రక్షణశాఖ అధికారులు పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

**రేపు కేబినెట్ భేటీ..** ఇక, బుధవారం కేంద్ర మంత్రివర్గం సమావేశం కానుంది. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. భద్రతాపరంగా అనుసరించాల్సిన వ్యూహాలు, సైనిక సన్నద్ధతపై చర్చించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది.

**19న పార్లమెంటరీ కమిటీ సమావేశం..** మరోవైపు విదేశాంగ పార్లమెంటరీ స్థాయి సంఘం సభ్యులతోనూ 'ఆపరేషన్ సిందూర్' వివరాలను కేంద్రం పంచుకోనుంది. మే 19వ తేదీన పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ శశిథరూర్ నేతృత్వంలో సమావేశం జరగనుంది. ఇందులో విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ.. 'సిందూర్' వివరాలను సభ్యులకు వెల్లడించనున్నారు.



# పాక్‌తో సరిహద్దు ఉన్న నగరాలకు పలు విమానాలు రద్దు

**న్యూఢిల్లీ :** కాల్పుల విరమణ ఒప్పందం జరిగినప్పటికీ పాకిస్థాన్ ఇంకా దాడులకు యత్నిస్తున్నట్లే కన్పిస్తోంది. సరిహద్దు ప్రాంతాల్లో సోమవారం రాత్రి మళ్లీ డ్రోన్లు కనిపించినట్లు కథనాలు వచ్చాయి. దీంతో అక్కడి ప్రజలు మరోసారి భయాందోళనకు గురవుతున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో దేశీయ విమానయాన సంస్థలు అప్రమత్తమయ్యాయి. పాక్‌తో సరిహద్దు పంచుకుంటున్న నగరాలకు పలు విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌ఇండియా, ఇండిగో ప్రకటించాయి. "తాజా పరిణామాలు, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జమ్మూ, లేహ్, జోధ్‌పుర్, అమృత్‌సర్, భుజ్, జామ్‌నగర్, చండీగఢ్, రాజ్‌కోట్ నగరాలకు మంగళవారం విమాన రాకపోకలు నిలిపివేస్తున్నాం. పరిస్థితులను నిశితంగా గమనిస్తున్నాం. అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు ప్రకటిస్తాం" అని ఎయిర్ ఇండియా తమ ప్రకటనలో వెల్లడించింది. అటు ఇండిగో కూడా ఇదే విధమైన ప్రకటన చేసింది. "ప్రయాణికుల భద్రతే మాకు అత్యంత ప్రాధాన్యం. దీని వల్ల మీ ప్రయాణ ప్రణాళికలకు అంతరాయం ఏర్పడినప్పటికీ రద్దు చేయక తప్పట్లేదు. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం" అని కంపెనీ పేర్కొంది. శ్రీనగర్, లేహ్, రాజ్‌కోట్, చండీగఢ్, జమ్మూ, అమృత్‌సర్ ప్రాంతాలకు ఇండిగో విమాన సర్వీసులను నిలిపివేసింది. వాస్తవానికి సరిహద్దు ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు కాస్త సద్దుమణిగినట్లు అనిపించడంతో సోమవారం నుంచి 32 ఎయిర్‌పోర్టులను తిరిగి అందుబాటులోకి తెచ్చిన సంగతి తెలిసిందే. దీంతో విమాన సేవలను పునరుద్ధరించేందుకు ఎయిర్‌లైన్లు కూడా సిద్ధమయ్యాయి. అయితే, జమ్మూకశ్మీర్‌లోని సాంబా సెక్టార్‌లో సోమవారం రాత్రి డ్రోన్ల కదలికలు కన్పించాయి. అటు పంజాబ్‌లోని జలంధర్‌లో ఓ నిఘా డ్రోన్‌ను కూల్చివేసినట్లు సైనిక బలగాలు ప్రకటించాయి. కలవరపడాల్సిందేమీ లేదని, పరిస్థితి పూర్తి నియంత్రణలోనే ఉందని వెల్లడించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో దిల్లీ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని కొంతదూరం వెళ్లాక తిరిగి వెనక్కి మళ్లించారు. అనంతరం విమాన సర్వీసులు నిలిపివేస్తున్నట్లు ఇండిగో ప్రకటించింది. ఎయిర్‌ఇండియా కూడా ఇదే నిర్ణయాన్ని వెల్లడించింది.

# రోహిత్, విరాట్‌కు మైదానంలో వీడ్కోలు ఏర్పాటు చేయాల్సింది

### అనిల్ కుంబ్లే




టీమ్ ఇండియా.. ఇంగ్లండ్ పర్యటనకు ముందు మొదట రోహిత్ శర్మ , తర్వాత విరాట్ కోహ్లీ టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్‌మెంట్లను ప్రకటించి క్రీడాలోకాన్ని విస్మయానికి గురి చేశారు. మే 7న హిట్‌మ్యాన్ వీడ్కోలు పలికితే, మే 12 విరాట్.. టెస్ట్ క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లకు మైదానంలో వీడ్కోలు (ఆన్ ఫీల్డ్ ఫేర్‌వెల్) ఏర్పాటు చేయాల్సిందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. 'ఇద్దరు మేటి క్రికెటర్లు కొద్ది రోజుల వ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు టెస్ట్ క్రికెట్‌కు తమ రిటైర్‌మెంట్లు ప్రకటించారు. ఇది నన్ను నిజంగా ఆశ్చర్యానికి గురి చేసింది. ముఖ్యంగా కోహ్లీ విషయంలో ఇలా జరుగుతుందని నేను అస్సలు ఊహించలేదు. అతడిలో ఇంకా కొన్ని సంవత్సరాలు టెస్ట్ క్రికెట్ ఆడే సామర్థ్యం ఉంది' అని కుంబ్లే అన్నాడు. అలాగే వీరిద్దరి రిటైర్‌మెంట్ విధానం మీద కూడా అనిల్ కుంబ్లే మాట్లాడాడు. 'ఇది నిజంగా నిశ్శబ్ద నిష్క్రమణ. మైదానంలో ప్రేక్షకుల మధ్య రోహిత్, కోహ్లీల వీడ్కోలు ఉంటే బాగుండేది. గతంలో అశ్విన్ కూడా సిరీస్ మధ్యలోనే తన రిటైర్‌మెంట్ ప్రకటించి వెళ్లిపోయాడు. నా అభిప్రాయం ప్రకారం అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ ముగ్గురి వీడ్కోలు మైదానంలో ప్రేక్షకుల మధ్య జరిగి ఉండాల్సింది' అని అభిప్రాయపడ్డాడు. ఇంగ్లండ్‌తో, టీమ్‌ఇండియా టెస్ట్ సిరీస్ గురించి కూడా కుంబ్లే విశ్లేషించాడు. 'ఈ సిరీస్‌లో కోహ్లీ కీలక ఇన్నింగ్స్‌లు ఆడతాడని నేను ఊహించా. కానీ అతడు అనూహ్యంగా టెస్ట్ క్రికెట్‌కు రిటైర్‌మెంట్ ప్రకటించాడు. సెలక్టర్లకు కూడా ఇది విషమ పరీక్షే. ఇంగ్లండ్‌లో అయిదు టెస్ట్‌ల సిరీస్ అంటే మామూలు విషయం కాదు. ఇది కఠిన సవాళ్లతో కూడుకున్నది. నాకు తెలిసి రోహిత్, కోహ్లీ నిర్ణయాలతో సెలక్టర్లు కూడా ఆశ్చర్యానికి గురై ఉంటారు' అని అనిల్ కుంబ్లే అన్నాడు. టీమ్‌ఇండియా పేసర్ మహ్మద్ సిరాజ్ కూడా విరాట్ రిటైర్‌మెంట్‌పై 'ఎక్స్' వేదికగా స్పందించాడు. 'టెస్ట్ క్రికెట్‌లో నువ్వు అద్భుతమైన కెరీర్ కలిగి ఉన్నందుకు అభినందనలు. నీ వారసత్వం ఎప్పటికీ కొనసాగుతుంది' అని భారత పేసర్ సిరాజ్ పోస్ట్ చేశాడు. 'ఇకపై నువ్వు డ్రెస్సింగ్ రూంలో లేకపోవడం పెద్ద లోటే. ఎల్లప్పుడూ నాకు మద్దతుగా నిలిచి, వెన్నుతట్టి ప్రోత్సహించినందుకు నీకు కృతజ్ఞతలు. ఆల్ ది బెస్ట్. కింగ్ విరాట్ కోహ్లీ భయ్యా' అని టీమ్‌ఇండియా సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్ అన్నాడు.

## 2027 వన్డే వరల్డ్ కప్‌లో రోహిత్, విరాట్ ఆడరు: సునీల్ గావస్కర్



ఇంగ్లండ్ సిరీస్‌కు ముందు టెస్ట్ క్రికెట్‌కు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ రిటైర్‌మెంట్ ప్రకటించి అభిమానులందరినీ విస్మయానికి గురి చేశారు. వీరిద్దరూ ఇప్పటికే పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఇకపై కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగనున్నారు. తనకు 2027 వన్డే వరల్డ్ కప్ ఆడాలని ఆశగా ఉందని విరాట్ కోహ్లీ ఓ సందర్భంలో తన మనసులోని మాటను బయటకు చెప్పాడు. రోహిత్ శర్మ కూడా వన్డే క్రికెట్‌కు ఎంతో ప్రాముఖ్యం ఇస్తాడు. కానీ వీరిద్దరూ 2027 వరల్డ్‌కప్‌లో ఆడరు అని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సునీల్ గావస్కర్ అంటున్నాడు. రోహిత్, విరాట్‌కు ప్రాక్టికల్‌గా ఇది సాధ్యం కాదని అభిప్రాయపడుతున్నాడు. 'రోహిత్, కోహ్లీ వన్డేల్లో అద్భుతంగా ఆడతారు. 2027 వరల్డ్ కప్ విషయానికొస్తే... అప్పటికీ వీరిద్దరిలో ఇప్పటిలానే దూకుడుగా, నిలకడగా ఆడే సత్తా ఉంటుందా?.. అని సెలక్షన్ కమిటీ ఆలోచిస్తుంది. వారిద్దరూ ఆడగలరు అని అనుకుంటే.. వారు 2027 వరల్డ్‌కప్‌నకు ప్రాతినిధ్యం వహిస్తారు' అని సునీల్ గావస్కర్ అన్నాడు. కానీ తన వ్యక్తిగత అభిప్రాయం మాత్రం వేరేలా ఉందని కుండబద్దలు కొట్టాడు. 'నిజాయితీగా చెప్పాలి అంటే... నా అంచనా ప్రకారం రోహిత్, విరాట్ కోహ్లీ 2027 వరల్డ్ కప్ ఆడలేరు. కానీ ఎవరికి తెలుసు... ఒకవేళ బాగా ఆడుతూ, అప్పటికి కూడా సెంచరీల మీద సెంచరీలు చేస్తే మాత్రం వారిని ఆ భగవంతుడు కూడా టీమ్ నుంచి తొలగించలేడు' అని గావస్కర్ అన్నాడు.

## మళ్లీ మొదటి నుంచి పంజాబ్, ఢిల్లీ మ్యాచ్




భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతల కారణంగా వాయిదా పడిన ఐపీఎల్‌ను మే 17 నుంచి పున: ప్రారంభించాలని బీసీసీఐ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఆరు వేదికల్లో (బెంగళూరు, జైపుర్, ఢిల్లీ, లఖ్‌నవూ, అహ్మదాబాద్, ముంబయి) లీగ్ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఫైనల్ జూన్ 3న జరుగుతుంది. ప్లే ఆఫ్స్ వేదికలను త్వరలో ప్రకటిస్తారు. ఇక, ఈ నెల 8న ధర్మశాల వేదికగా పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ జరగాల్సి ఉండగా.. పంజాబ్ ఇన్నింగ్స్‌లో 10.1 ఓవర్ల ఆట తర్వాత మ్యాచ్‌ను అర్ధంతరంగా రద్దు చేశారు. భద్రతా కారణాల రీత్యా ఈ మ్యాచ్‌ను మధ్యలోనే నిలిపివేశారు. సాధారణంగా మ్యాచ్ రద్దయితే ఇరుజట్లకు చెరో పాయింట్ కేటాయిస్తారు. కానీ, ఈ రెండు టీమ్‌లకు పాయింట్లను కేటాయించకపోవడంతో అభిమానులు గందరగోళానికి గురయ్యారు. అయితే, కొత్తగా ప్రకటించిన షెడ్యూల్‌తో దీనిపై క్లారిటీ వచ్చింది. మే 24న జైపుర్ వేదికగా పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ జరగనుంది. ధర్మశాలలో జరిగిన 10.1 ఓవర్ల ఆటతో సంబంధం లేకుండా మళ్లీ మొదటి నుంచి మ్యాచ్‌ను నిర్వహించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఒకరకంగా పంజాబ్‌కు ఇబ్బంది కలిగించే విషయమే. ఎందుకంటే ధర్మశాలలో ఆ జట్టు 10.1 ఓవర్లు పూర్తి అయ్యేసరికి ఒకే వికెట్ నష్టపోయి 122 పరుగులు చేసింది. ఇప్పుడు మళ్లీ మొదటి బంతి నుంచి మ్యాచ్ ఆడితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పలేం. పంజాబ్ ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడి 15 పాయింట్లతో ఉంది. మిగిలిన మూడు మ్యాచ్‌ల్లో ఒకదాంట్లో గెలిచినా ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరడం ఖాయం.

**అహ్మదాబాద్‌లో ఫైనల్?**

ఏప్రిల్ 29న క్వాలిఫయర్-1, 30న ఎలిమినేటర్, జూన్ 1న క్వాలిఫయర్ 2, జూన్ 3న ఫైనల్ నిర్వహించనున్నారు. అయితే, ఈ మ్యాచ్‌లకు సంబంధించిన వేదికలను అధికారికంగా ఖరారు చేయలేదు. ముంబయిలో ప్లే ఆఫ్ మ్యాచ్, అహ్మదాబాద్‌లో ఫైనల్ నిర్వహించే అవకాశమున్నట్లు వార్తలొస్తున్నాయి.

## డబ్ల్యూటీసీ ఫైనల్.. ఐపీఎల్‌లో ఆ జట్లకు షాక్!

లార్డ్స్ వేదికగా జూన్ 11-15 మధ్య ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్ ఫైనల్ జరగనుంది. తుది పోరులో దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా తలపడనున్న విషయం తెలిసిందే. దక్షిణాఫ్రికా 12 టెస్ట్‌ల్లో 8 విజయాలతో 69.44 పాయింట్లతో అగ్రస్థానంలో, ఆస్ట్రేలియా 19 మ్యాచ్‌ల్లో 13 విజయాలతో 67.54 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి తుది పోరుకు అర్హత సాధించాయి. ఈ కీలక మ్యాచ్ కోసం ఇవాళ ఉదయం ఆస్ట్రేలియా తమ జట్టును ప్రకటించగా కాసేపటి క్రితం దక్షిణాఫ్రికా కూడా టీమ్‌ను ప్రకటించింది. తెంబా బావుమా కెప్టెన్‌గా 15 మందితో టీమ్‌ను ఎంపిక చేశారు. గాయం కారణంగా కొంతకాలంగా టెస్టులకు దూరమైన లుంగి ఎంగిడి తిరిగి జట్టులోకి వచ్చాడు.

**ఐపీఎల్.. ఆ టీమ్‌లపై ప్రభావం**

డబ్ల్యూటీసీ ఫైనల్ ప్రభావం ఐపీఎల్‌పై పడనుంది. పలు జట్లు కీలక ఆటగాళ్లను సేవలను కోల్పోయే ఛాన్స్ ఉంది. డబ్ల్యూటీసీ ఫైనల్ కోసం దక్షిణాఫ్రికా ప్రకటించిన 15 మంది ఆటగాళ్లలో ఎనిమిది మంది ప్రస్తుతం ఐపీఎల్‌లో ఆడుతున్నారు. వారెవరంటే.. రికెల్‌టన్, కోర్బిన్ బాస్ (ముంబయి), లుంగి ఎంగిడి (ఆర్సీబీ), ట్రిస్టన్ స్టబ్స్ (ఢిల్లీ), మార్కో యాన్సెన్ (పంజాబ్), మార్‌క్రమ్ (లఖ్‌నవూ), కగిసో రబాడ (గుజరాత్), వియాన్ ముల్డర్ (హైదరాబాద్). ఆసీస్ డబ్ల్యూటీసీ జట్టులో ఉన్న కమిన్స్, ట్రావిస్ హెడ్ (హైదరాబాద్), హేజిల్‌వుడ్ (ఆర్సీబీ), జోష్ ఇంగ్లిస్ (పంజాబ్), మిచెల్ స్టార్క్ (ఢిల్లీ) ఐపీఎల్‌లో ఆడుతున్నారు. ఇందులో ముంబయి, ఆర్సీబీ, ఢిల్లీ, లఖ్‌నవూ, పంజాబ్ జట్లకు ప్లే ఆఫ్స్ అవకాశాలున్నాయి. మరోవైపు, భారత్, పాక్ ఉద్రికత్తలతో ఇప్పటికే చాలామంది విదేశీ ఆటగాళ్లు స్వదేశానికి వెళ్లిపోయారు. ఒకవేళ వారు భారత్‌కు తిరిగి వచ్చినా డబ్ల్యూటీసీ ఫైనల్ ఆడాల్సి ఉన్న ఆటగాళ్లు ఐపీఎల్‌లో తాము ప్రాతినిధ్యం వహించే జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరితే అందుబాటులో ఉండకపోవచ్చు.




## స్విగ్గీ, పేటీఎం షేర్లు డౌన్.. కారణం ఏంటంటే?

ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ స్విగ్గీ షేర్లు మంగళవారం క్షీణించాయి. ఆరు నెలల లాకిన్ పీరియడ్ నేటితో ముగిసిన నేపథ్యంలో ఇవి ఒత్తిడికి గురయ్యాయి. దీంతో స్విగ్గీ షేర్లు ఇంట్రాడేలో ఏకంగా 7శాతం క్షీణించాయి. మార్కెట్ ప్రారంభంలోనే స్విగ్గీ షేర్లు 5 శాతం నష్టంతో రూ.305 వద్ద ప్రారంభమయ్యాయి. లిస్టింగ్ తర్వాత నమోదైన రూ.617 మార్క్ నుంచి స్విగ్గీ క్రమంగా పతనవుతోంది. ప్రస్తుతం పోస్ట్ లిస్టింగ్ గరిష్ఠ స్థాయి నుంచి సగానికి పైగా కుంగింది. ఉదయం 10:20 గంటల సమయంలో స్విగ్గీ షేర్లు 5.40 శాతం నష్టంతో రూ.303 వద్ద ట్రేడవుతున్నాయి.

**5% కుంగిన పేటీఎం షేర్లు..**

ప్రముఖ ఫిన్‌టెక్ కంపెనీ 'పేటీఎం' మాతృ సంస్థ 'వన్ 97 కమ్యూనికేషన్స్' షేర్లు నేడు నష్టాల్లోకి జారుకున్నాయి. ఇంట్రాడేలో ఏకంగా 5 శాతానికి పైగా షేర్లు కుంగాయి. పేటీఎం బ్రాండ్‌పై సేవలందించే వన్97 కమ్యూనికేషన్స్‌లో 4% వాటాను రూ.2,066 కోట్లకు ఆర్థిక సేవల సంస్థ యాంట్ గ్రూప్ విక్రయించనుందని వార్తలు వచ్చిన నేపథ్యంలో షేర్లపై ఒత్తిడి పెరిగింది. బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో బ్లాక్ డీల్ ద్వారా షేర్లను విక్రయించనుందని తెలుస్తోంది. దీని ఫ్లోర్ ప్రైజ్ రూ.809.75గా నిర్ణయించినట్లు సమాచారం.

## తిరస్కరించిన అధిక పింఛను దరఖాస్తుల పునఃపరిశీలన: ఈపీఎఫ్‌వో

**హైదరాబాద్:** తిరస్కరణకు గురైన ఈపీఎఫ్‌వో అధిక పింఛను దరఖాస్తుల్ని మరోసారి పరిశీలించేందుకు ఈపీఎఫ్‌వో బోర్డు అవకాశమిచ్చింది. భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) ప్రయత్నాల కారణంగా తిరస్కరించిన దరఖాస్తుల్ని మరోసారి ప్రాసెస్ చేసేందుకు బోర్డు అంగీకరించిందని, ఈ మేరకు జోనల్, ప్రాంతీయ కార్యాలయాలకు ఆదేశాలు జారీ అయ్యాయని బోర్డు సీబీటీ సభ్యుడు సుంకరి మల్లేశం తెలిపారు. సరైన పత్రాలు లేవని, సకాలంలో ఇవ్వలేదన్న కారణాలతో భారీ సంఖ్యలో అధిక పింఛను దరఖాస్తులను ఈపీఎఫ్‌వో తిరస్కరించింది. తెలంగాణలోనూ ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, పింఛనుదారులవి తిరస్కరించడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈపీఎఫ్‌వోలో అధిక పింఛను దరఖాస్తు ఒకసారి తిరస్కరణకు గురైతే దానిని తిరిగి పునరుద్ధరించే అవకాశం లేకుండా పోయింది. గడువులోగా దరఖాస్తులు పరిష్కరించాలన్న ఉద్దేశంతో అధిక సంఖ్యలో తిరస్కరించడంతో ఉద్యోగ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. ఈ పరిస్థితిని గమనించిన బీఎంఎస్, సీబీటీ సభ్యుడు మల్లేశం కేంద్ర కార్యాలయానికి వివరించారు. దీంతో తిరస్కరణకు గురైన దరఖాస్తులను తిరిగి పునరుద్ధరించేందుకు ఆప్షన్‌ను కార్యాలయం అందుబాటులోకి తీసుకువచ్చింది. క్షేత్రస్థాయి అధికారులు వాటిని మరోసారి పరిశీలించాలని సూచించింది.


## భారీ నష్టాల్లో ముగిసిన సూచీలు



**ముంబయి:** భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందంతో నిన్న దూసుకెళ్లిన మన సూచీలు.. నేడు భారీ నష్టాలు చవిచూశాయి. మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం ఇందుకు కారణం. ముఖ్యంగా అధిక వెయిటేజీ కలిగిన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్, రిలయన్స్ వంటి షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఇంట్రాడేలో 1300 పాయింట్ల మేర నష్టపోగా.. నిఫ్టీ 24,600 స్థాయి దిగువకు చేరింది. సెన్సెక్స్ 82,249.60 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,429.90) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా అదే ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 81,043.69 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1281.68 పాయింట్ల నష్టంతో 81,148.22 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 346.35 పాయింట్ల నష్టంతో 24,578.35 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.33గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో సన్‌ఫార్మా, అదానీ పోర్ట్స్, బజాజ్ ఫైనాన్స్, ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా షేర్లు మాత్రమే లాభాల్లో ముగిశాయి. మిగిలిన షేర్లు నష్టాలు చవిచూశాయి. ఇన్ఫోసిస్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, ఎటర్నల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.నాలుగేళ్లలో ఎన్నడూ లేని రీతిలో నిన్న సెన్సెక్స్, నిఫ్టీ దూసుకెళ్లాయి. కానీ, ఎఫ్ఐఐ, డీఐఐలు కలిపి కొనుగోలు చేసింది రూ.2694 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు మాత్రమే. రిటైల్, హెచ్ఎన్ఐల కొనుగోళ్లు జరిపారు. ఈ నేపథ్యంలో నేడు గరిష్ఠాల వద్ద ప్రాఫిట్ బుకింగ్ కనిపించింది. అమెరికా-చైనా మధ్య వాణిజ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో అంతర్జాతీయంగా పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. కానీ మన మార్కెట్‌కు నెగిటివ్‌గా మారింది. ఆ రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగితే భారత్‌కు పరోక్షంగా లాభమన్న అంచనాలు ఇన్నాళ్లు ఉన్నాయి. తాజా పరిణామాలు కొంతమేర దాన్ని నీరుగార్చాయి. భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో క్రూడాయిల్ ధరలు మళ్లీ క్రమంగా పెరుగుతున్నాయి. బ్రెంట్ క్రూడ్ 65 డాలర్ల స్థాయి వద్ద ట్రేడవుతోంది. చమురు దిగుమతులపై ఆధారపడే మన దేశానికి ఇది ప్రతికూల అంశం కావడం కూడా సూచీల నష్టాలకు మరో కారణమని విశ్లేషకులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, ఐసీఐసీఐ బ్యాంక్ కలిసి సెన్సెక్స్ దాదాపు 700 పాయింట్లు క్షీణించడంలో భూమిక పోషించాయి. ఐటీ స్టాక్స్‌లోనూ లాభాల స్వీకరణతో టీసీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు నష్టాల్లో ముగిశాయి.

## ప్రైమ్ వీడియోలో ఇక యాడ్స్..

### వద్దనుకుంటే అదనంగా చెల్లించాల్సిందే




ప్రముఖ వీడియో స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో యూజర్లకు అలర్ట్. ప్రైమ్ వీడియోలో ఇకపై యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. వచ్చే నెల నుంచి సినిమాలు, షోల మధ్యలో ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రకటనల్లేని వీడియో స్ట్రీమింగ్ సేవలు పొందాలంటే అదనంగా చెల్లించాల్సి ఉంటుంది. ఈ మేరకు యూజర్లకు ఇ-మెయిల్స్ పంపిస్తోంది. అమెజాన్ ప్రైమ్ సబ్‌స్క్రిప్షన్ తీసుకున్న వారికి ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ మధ్యలో ప్రస్తుతం ఎలాంటి యాడ్స్ కనిపించడం లేదు. జూన్ 17 నుంచి మాత్రం పరిమితి సంఖ్యలో యాడ్స్ దర్శనం ఇవ్వనున్నాయి. మెరుగైన కంటెంట్‌ను అందించడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెజాన్ యూజర్లకు పంపిన మెయిల్స్‌లో పేర్కొంది. సంప్రదాయ టీవీ ఛానెళ్లు, ఇతర మాధ్యమాల మాదిరిగా కాకుండా 'అర్థవంతమైన' యాడ్స్ మాత్రమే ప్రదర్శిస్తామని తెలిపింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్ షిప్ ధరలో ఎలాంటి మార్పులూ చేయడం లేదని పేర్కొంది. యాడ్ ఫ్రీ ఎక్స్‌పీరియన్స్ కోరుకునే వారి కోసం కొత్తగా రెండు ప్లాన్లను అందుబాటులోకి తెచ్చింది. ప్రస్తుత ప్రైమ్ మెంబర్‌షిప్ ఉన్నవారు నెలవారీ రూ.129, ఏడాదికి రూ.699 చొప్పున యాడ్-ఆన్ ప్లాన్స్ తీసుకుంటే ఎలాంటి ప్రకటనలూ కనిపించవని తెలిపింది. జూన్ 17 నుంచి ఈ ప్యాక్స్ అందుబాటులోకి రానున్నాయని పేర్కొంది. గతంలో ఆస్ట్రేలియా, కెనడా, మెక్సికో, యూకే, యూఎస్ వంటి దేశాలకే పరిమితమైన యాడ్స్‌ను తాజాగా భారత్‌కూ తీసుకొచ్చింది. ప్రైమ్-లైట్ ప్లాన్ తీసుకున్న వారికి ఇప్పటికే యాడ్స్ వస్తున్నాయి.




## రూ.399కే బ్రాడ్‌బ్యాండ్ డీటీహెచ్..

### ఎయిర్‌టెల్ బ్లాక్ కొత్త ప్లాన్

ప్రముఖ టెలికాం సంస్థ ఎయిర్‌టెల్ తన బ్లాక్ ప్లాన్‌ను సవరించింది. ఇకపై రూ.399 నుంచే ఐపీటీవీ సేవలను అందించనుంది. ఓ వైపు డేటా, డీటీహెచ్ ప్రయోజనాలు, ల్యాండ్ లైన్ నుంచి అపరిమిత కాల్స్ చేసుకునే సదుపాయాన్ని అందించనుంది. ఇప్పటి వరకు ఐపీటీవీ ప్లాన్ల ధరలు రూ.699 నుంచి ప్రారంభం అవుతుండగా.. ఇకపై రూ.399 నుంచే (జీఎస్టీ అదనం) లభించనున్నాయి. ఈ ఏడాది మార్చి నుంచి దేశవ్యాప్తంగా 2 వేల నగరాల్లో ఐపీటీవీ సేవలను ఎయిర్‌టెల్ ప్రారంభించిన సంగతి తెలిసిందే. తాజాగా తన ఎంట్రీలెవల్ బ్రాడ్‌బ్యాండ్ ప్లాన్ రూ.399కు సవరణ చేసి ఐపీటీవీ సేవలను జోడించింది. ఈ ప్లాన్‌పై 10 ఎంబీపీఎస్ వేగంతో బ్రాడ్‌బ్యాండ్ సేవలు లభిస్తాయి. ఎఫ్‌యూపీ (3,300జీబీ వరకు) పరిమితి తర్వాత ఇంటర్నెట్ వేగం 1 ఎంబీపీఎస్‌కు తగ్గుతుంది. ఈ ప్లాన్‌లో 260 టీవీ ఛానెళ్లు ఉచితంగా లభిస్తాయి. ఇందులో ఎలాంటి ఓటీటీ ప్రయోజనాలూ ఉండవు. కొత్త కనెక్షన్ తీసుకోవాలనుకునే వారు ఒకేసారి రూ.2500 చెల్లించాల్సి ఉంటుంది. హార్డ్‌వేర్ ఇన్‌స్టలేషన్‌కు ఎలాంటి రుసుములూ చెల్లించనక్కర్లేదు. ఈ మొత్తాన్ని రాబోయే బిల్లింగ్ సైకిల్‌లో సర్దుబాటు చేస్తారు. ఓటీటీ ప్రయోజనాలు లేకుండా కేవలం తక్కువ వేగంతో బ్రాడ్‌బ్యాండ్, ఐపీటీవీ సేవలు కోరుకునేవారు రూ.399 ఎంపిక చేసుకోవచ్చు. ఎక్కువ వేగంతో కూడిన డేటా, ఓటీటీ ప్రయోజనాలు కావాలంటే రూ.699, రూ.899, రూ.1199, 1599 వంటి ప్లాన్లను ఎంపిక చేసుకోవచ్చు. ఆయా ప్లాన్లను బట్టి జియోహాట్‌స్టార్, సోనీలివ్, అమెజాన్ ప్రైమ్, నెట్‌ఫ్లిక్స్, జీ5 వంటి ఓటీటీ బెనిఫిట్స్ లభిస్తాయి.

రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం తెలుగు దిన పత్రిక



## విద్యావేత్తగా కీర్తి?

పాత్ర ఏదైనా తన నటనతో మెప్పించే కథానాయిక కీర్తి సురేశ్.. 'బేబీ జాన్'తో ఇటీవలే బాలీవుడ్‌లో అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. దీని తర్వాత హిందీలో మరో ప్రాజెక్టు కోసం పలువురు దర్శకనిర్మాతలు ఆమెతో చర్చలు చేస్తున్నట్లు కొన్ని రోజులుగా నెట్టింట్లో వార్తలు సందడి చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పుడు మరో ఆసక్తికర విషయం బయటి కొచ్చింది. దేశంలోని ప్రస్తుత విద్యా వ్యవస్థపై రూపొందుతున్న

ఓ చిత్రంలో బాలీవుడ్ కథానాయకుడు రాజ్‌కుమార్ రావుతో కలిసి కీర్తి నటించనున్నట్లు సమాచారం. ఇంకా పేరు ఖరారు కాని ఈ ప్రాజెక్టును రాజ్ తన సొంత నిర్మాణ సంస్థపై తీర్చిదిద్దుతున్నారని తెలుస్తోంది. "ప్రస్తుతం విద్యను ఒక వ్యాపారంలా చేస్తున్నారు. ఈ వ్యవస్థలోని కుంభకోణాల్ని బయటపెట్టే విద్యావేత్తగా శక్తిమంతమైన పాత్రలో కనిపించనుంది కీర్తి. 'సెక్టార్ 36'ఫేమ్ ఆదిత్య నింబాల్కర్ దర్శకత్వం వహిస్తున్నారు. జూన్‌లో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానుంద"ని కీర్తి సన్నిహిత వర్గాలు తెలిపాయి.

## కాలేజీ డేస్‌లోనే మహేశ్‌బాబు తెలుసు : త్రిష



కాలేజ్ డేస్ నుండే మహేష్ బాబుతో త్రిష పరిచయయముందంట. సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రిష జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జోడికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉ ంటుంది. వీరిద్దరు అతడు సినిమాలో నటించగా, అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికి కూడా ఈ సినిమా టీవీలో వేస్తే చాలు ఎంతోమంది చూస్తూ ఉంటారు. ఒక రకంగా టీవీలో బ్లాక్ బస్టర్ సినిమా ఏది అంటే అతడు అనే అంటారు అందరూ. మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన ఈ సినిమా థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన బుల్లి తెరపై మాత్రం మంచి విజయం సాధించింది. ముఖ్యంగా ఈ చిత్రంలో త్రిష, మహేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బావ ప్రేమకోసం ఎదురుచూసే పల్లెటూరి అమ్మాయిగా త్రిష పాత్రలో ఒదిగిపోయింది. ఇక మహేష్ బాబు కూడా కాస్త యాటిట్యూడ్ ప్రదర్శిస్తూ సీరియస్‌గా చాలా అద్భుతంగా నటించారు. వారిద్దరి పాత్రలకి ప్రేక్షకులు ఇట్టే కనెక్ట్ అయ్యారు. అతడు తర్వాత త్రిష మహేష్ బాబు కలిసి సైనికుడు సినిమా చేశారు. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ తర్వాత త్రిష, మహేష్ బాబు కలిసి నటించలేదు. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి త్రిష ఆసక్తికర కామెంట్స్ చేసింది. మహేష్ బాబు తన ఫేవరెట్ హీరోల్లో ఒకరు అని చెప్పిన ఈ ముద్దుగుమ్మ .. మహేష్ బాబు సెట్ లో చాలా సరదాగా ఉంటాడని, చాలా హార్డ్ వర్క్ చేస్తాడు అని పేర్కొంది.. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కూడా అందరిని చాలా గౌరవిస్తాడు. అసలు కారవాన్ లోకి కూడా వెళ్లడు. తన షూటింగ్ అయిపోయినా కూడా .. మానిటర్ దగ్గర కూర్చొని ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉంటారు.. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే మహేష్ బాబు నాకు చాలా కాలం నుంచి తెలుసు. మేము ఇద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాము. మా ఇద్దరికి మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండేవారు. వారి వల్ల మహేష్ తో పరిచయం ఏర్పడింది. ఆ టైం లో మేము యాక్టర్స్ అవుతామని ఊహించలేదు. అప్పుడు హాయ్, బాయ్ ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేది అని త్రిష పేర్కొంది. ఇక ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తెలుగులో చిరంజీవితో విశ్వంభర చేస్తుంది.

## నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కూలీ

### ముందు అనుకున్న స్టోరీ వేరన్న లోకేశ్ కనగరాజు




రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ క్రమంలో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. రజనీకాంత్‌కు తొలుత వేరే కథ చెప్పానని, అది ఆయనకు నచ్చినా అనుకోని కారణాలతో ఈ కథను పక్కన పెట్టినట్లు- తెలిపారు. రజనీకాంత్ సర్‌తో సినిమా చేయాలనుకున్నప్పుడు ఆయన్ను కలిసి ఒక కథ చెప్పాను. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు నెలలకు పైగా ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ఆ కథ, దాని నేపథ్యం రజనీ సర్‌కు బాగా నచ్చాయి. రెండు నెలల తర్వాత మళ్లీ ఆయన్ను కలిసినప్పుడు 'ఈ కథ వద్దు. మరొక స్టోరీ చేద్దాం' అని అన్నాను. అదే 'కూలీ'. రజనీ సర్‌కు ఆ స్టోరీ నచ్చినా నేను చేయకపోవడానికి ఒక కారణం ఉంది. నేను అనుకున్న పాయింట్ ఒక చోట పూర్తిగా డౌన్ అయిపోయినట్లు- అనిపించింది. దీంతో ఆ ప్రాజెక్ట్‌పై ఆసక్తి సన్నగిల్లిపోయింది. భవిష్యత్‌లో ఎప్పుడైనా కొత్త ఆలోచన వస్తే, ఆ కథను అందుకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తా. అంతేకానీ, అదే కథను పట్టుకుని రజనీ సర్ విలువైన సమయాన్ని వృథా చేయటం నాకు ఇష్టం లేదని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఇక 'కూలీ' విషయానికొస్తే భారీ బడ్జెట్, భారీ తారాగణంతో లోకేశ్ దీన్ని తీర్చిదిద్దారు. ఐటమ్ సాంగ్‌లో పూజా హెగ్డే ఆడి పాడింది. ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారు. ఆగస్టు 14న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'కూలీ'ని విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ మూవీ తీసుకొస్తున్నారు. రజనీకాంత్ ఇందులో కూలీ నెంబర్ 1421గా దేవా పాత్రలో సందడి చేయనున్నారు. అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.



## కుటుంబ కథతో.. 3 బీహెచ్‌కే




సిద్ధార్థ్ కథానాయకుడిగా శ్రీగణేశ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం '3 బీహెచ్‌కే'. శరత్‌కుమార్, దేవయాని, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్ విశ్వ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని జులై 4న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ఇంటిల్లిపాదినీ అలరించే, అన్ని రకాల వాణిజ్య హంగులున్న చిత్రమిదని సినీ వర్గాలు తెలిపాయి. మీతా రఘునాథ్, చైత్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అమృత్ రామ్‌నాథ్, కూర్పు: గణేశ్ శివ, సంభాషణలు: రాకేందు మౌళి, కళ: వినోద్ రాజ్‌కుమార్.ఎన్, ఛాయాగ్రహణం: దినేశ్ కృష్ణన్.బి, జితిన్ స్టానిస్లాస్.

## జయం రవి, కెనిషాల మధ్య పెరిగిన బంధం

### భార్య ఆర్తి కామెంట్స్‌కు కెనీషా ఘాటు జవాబు

హీరో జయం రవి ఇంటి గురించి రోజుకో వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ముందు నుంచి సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ కి జయం రవి కి మధ్య రిలేషన్ ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. రీసెంట్‌గా ఓ పెళ్లికి వీరిద్దరు జంటగా హాజరవడంతో మరోసారి కోలీవుడ్ లో పుకార్లు మరింత పుంజుకున్నాయి. ఈ ఫోటో క్షణాల్లోనే సోషల్ మీడియా మొత్తం వైరల్ అవ్వడంతో ఇది చూసిన జయం రవి భార్య ఆర్తి సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసింది. 'మాకు చట్టరిత్యా ఇంకా విడాకులు అవ్వలేదు, విడాకులు వచ్చేవరకు నేను ఆర్తి రవినే,18 సంవత్సరాలు నాతో కలిసి ఉన్న వ్యక్తి నన్ను ఇంట్లో నుండి గెంటేసి, పిల్లలను కూడా పట్టించుకోకుండా, వారి అవసరాలకు కావలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు' అంటూ షాకింగ్ పోస్ట్ చేసింది. అయితే ఈ మాటలపై తాజాగా సింగర్ కెనీషా రివర్స్ పంచ్ ఇచ్చింది.. ఎవరికీ లొంగని ఒక మగాడు.. ఏ మహిళతో అయితే ఆనందం ఉంటుందో ఆ మహిళ దగ్గరే ఉంటాడు. ఆ మహిళకే మనసు ఇస్తాడు. మౌనంగా ఉ ంటున్నాను కదా అని నన్ను లైట్ తీసుకోకు.. నా మౌనమే నా బలం' అంటూ ఆర్తికి పరోక్షంగా కొటేషన్‌తో కౌంటర్ ఇచ్చింది. దీంతో సింగర్ కెనీషా పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అంటే దీని అర్థం ఆర్తి దగ్గర ప్రశాంతత లేకపోవడం వల్లే కెనిషాకి జయం రవి దగ్గరై ఆమెకు మనసిచ్చాడని పూర్తిగా అర్థమవుతుంది అంటూ నెటిజన్ల కామెంట్లు పెడుతున్నారు.



## బిస్లరీ వాటర్‌తో స్నానం చేసిన నటి శ్రీవిద్య



ఎవరి సమయంలో వారు బెట్టుగా ఉ ంటారు. నిర్మాతలను ఓ ఆటాడుకుంటారు. అలాంటి ఘటనే శ్రీవిద్య విషయంలోనూ జరిగిందట.కొంత మంది హీరోయిన్‌లు చాలా డిమాండింగ్‌గా ఉంటారు. నిర్మాతలను నానా రకాలుగా ఇబ్బంది పెడుతూ ఉంటారు. ఇందులో భాగంగా తాజాగా ఓ హీరోయిన్ సంబంధించిన వార్త ఒకటి వైరల్ అవుతుంది. ఆమె స్నానానికి కూడా బిస్లరీ వాటర్ కావాలని డిమాండ్ చేసిందట. నటి శ్రీవిద్య.. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఆమె తన యాక్టింగ్ తో సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 800కి పైగా సినిమాల్లో నటించిన ఆమె, నటనతో పాటు- పాటలు పాడడంలోనూ, డబ్బింగ్‌లోనూ తన ప్రతిభను చాటారు. చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి హీరోయిన్‌గా.. అటు-పై సపోర్టింగ్ రోల్స్ చేస్తూ అమ్మ, అక్క, చెల్లి, అత్త వంటి క్యారెక్టర్లతో అలరించారు. ఆమె పండించే భావోద్వేగాలకు ప్రేక్షకులు ఫిదా అయిపోయేవారు. అయితే ఓ తెలుగు సినిమా షూటింగ్ సమయంలో రాజమహేంద్రవరం వద్ద గోదావరి నీటితో స్నానం చేయాలంటే గ్లామర్ దెబ్బతింటు-ందని, తనకు కచ్చితంగా బిస్లరీ నీరు తెప్పించాలని పంతం పట్టిందట. అప్పట్లో లీటర్ బాటిల్ రూ.6. దీంతో తప్పేది లేక రెండు బకెట్ల బిస్లరీ నీటిని తెప్పిస్తే అప్పుడు ఆమె స్నానం చేశారట.

## సైనికుల మాతృమూర్తులకు కంటిమీద కునుకుండదు : అలియాభట్

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, పాక్ రెచ్చగొట్టే చర్యలు వంటి పరిణామాలతో దేశం ఒకరకమైన ఉద్విగ్న పరిస్థితులను ఎదుర్కొంది. సైన్యం పాక్‌కు దీటుగా బదులిచ్చినందుకు దేశ ప్రజలు గర్వపడ్డారు. కానీ, ఆ సైనికులను పంపిన తల్లులు మాత్రం అనుక్షణం ఊపిరి బిగపట్టుకొని, తమ బిడ్డ కోసం కలవరపడుతూనే ఉన్నారు.. ఉంటారు. ఇదే విషయాన్ని ప్రముఖ బాలీవుడ్ నటి అలియాభట్ ఒక ఎమోషనల్ పోస్టు ద్వారా వ్యక్తం చేశారు. "కొన్ని రోజులుగా పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. నిశ్శబ్దమే వినిపించింది. అంతా ఆందోళన. ప్రతి మాట, వార్త వెనక ఒకరకమైన టెన్షన్. ఆదివారం మనమంతా మదర్స్ డేను సంతోషంగా చేసుకున్నాం. ఆలింగనాలు ఇచ్చి పుచ్చుకున్నాం. దేశ రక్షణ కోసం హీరోలను పెంచిన తల్లుల గురించి ఆలోచించకుండా ఉండలేకపోయా. వారిది అంతులేని త్యాగం. ప్రతి సైనికుడి యూనిఫామ్ వెనక నిద్ర లేని రాత్రులు గడిపే అతడి తల్లి ఉంటుంది. తన బిడ్డకు ఏ రాత్రి జోలపాటలా ఉండదని ఆ తల్లికి తెలుసు. అనిశ్చితి.. ఒత్తిడితో కూడిన ఆ నిశ్శబ్దం ఏ క్షణమైనా బద్దలు కావొచ్చు. కానీ.. ప్రతి రాత్రి ఉద్రిక్తతలు లేని ప్రశాంతతను కోరుకుంటున్నాం. ఆ తల్లిదండ్రుల ధైర్యం ఈ దేశాన్ని ఎంతగానో కదిలిస్తోంది. పంటి బిగువున బాధను నొక్కిపెట్టిన వారికి ప్రతిక్షణం అండగా ఉంటాం. మా రక్షకుల కోసం, ఈ దేశం కోసం కలిసి నిలబడతాం. జైహింద్" అంటూ సుదీర్ఘ పోస్టు పెట్టారు. గతనెల 22న పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది పౌరులు మృతిచెందిన విషయం తెలిసిందే. అందుకు ప్రతీకారంగా భారత ఆర్మీ 'ఆపరేషన్ సిందూర్' పేరిట మెరుపుదాడులకు దిగింది. ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసింది. కానీ పాక్ మాత్రం రెచ్చగొట్టే చర్యలకు యత్నించింది. నేరుగా ఎదుర్కోలేక అసత్య ప్రచారానికి పాల్పడింది. కానీ వాటన్నింటికి మన సైన్యం దీటుగా బదులిచ్చింది.

Printed, Published and Owned by **RAVU RAJITHA**, **Editor: RAVU NAGI REDDY**. **RAJAMUDRA PUBLICATIONS**, Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98,
**RNI NO : TELTEL/2024/86684**, Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com